# కవితా కౌముది - 2008





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 124



# విషయ సూచిక

(చిత్రాలు: దెందుకూరి రఘునాథ్)


| ఏడాది | నెల | కవిత | కవి / కవయిత్రి | పేజి |
|---|---|---|---|---|
| 2008 | 1 | పాచికల సాగు | కె.వి.వి.రావ్ | 4 |
| | | మరణమొక విషాదం కాదు... | పెరుగు రామకృష్ణ | 6 |
| | | పురుటి నొప్పులు | చొక్కాకుల వెంకట ప్రసాద్ | 8 |
| | | మాతృభాష | కృష్ణ అక్కులు | 9 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధరరావు | 11 |
| | | | | |
| 2008 | 2 | సాపేక్షం | సుదేరా | 12 |
| | | గ్లోబల్ పతంగి | రవి కిరణం | 14 |
| | | నేనే నేనై..! | మోహన్ చైతన్య | 15 |
| | | జరాభూతం | తమస్విని | 15 |
| | | నేను | డా.ప్రభాత్రేయ | 17 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధరరావు | 18 |
| | | | | |
| 2008 | 3 | ‘భూ గ్రామ‘ దేవత జాతర | యశ్వంత్ | 19 |
| | | సార్థకత | స్వర్గీయ డా.పులికంటి కృష్ణారెడి | 21 |
| | | పార్టీ అయిన తర్వాత | తమస్విని | 23 |
| | | పాప | ఉమ చింతలపాటి | 24 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధరరావు | 25 |
| | | | | |
| 2008 | 4 | వసంత పంచమి | రవి కిరణం | 26 |
| | | కాలమా ఆగిపో | మోహన్ చైతన్య | 27 |
| | | నెమరువేత | స్వాతి శ్రీపాద | 28 |
| | | నా తెలుగు పదం | సంజి శ్రీరామ్ | 29 |
| | | చెప్పవే చిరుగాలీ | దేవకీ నందన్ | 29 |

| | | | | |
|---|---|---|---|---|
| | | నీ రేయి నా దోయి | తమస్విని | 30 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధరరావు | 31 |
| | | | | |
| 2008 | 5 | చందురుడు- నేను | వి. ఆర్. విద్యార్థి | 33 |
| | | బజ్జో..నాన్నా.. | లక్కోజు గోవిందరాజు | 35 |
| | | అన్నదాత | సంజి శ్రీరామ్ | 35 |
| | | అందాలు | ఝాన్సీ లక్ష్మి కొత్త | 36 |
| | | నాన్న | తమస్విని | 37 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధరరావు | 38 |
| | | | | |
| 2008 | 6 | కవి | నచకి | 40 |
| | | బాల్యం | డా. సురేంద్ర దారా | 42 |
| | | నడిపించేవాడు | ఉదయకళ | 44 |
| | | చెలి | శివ | 46 |
| | | అనంత పయనం | చింతా లక్ష్మి సుజాత | 47 |
| | | వెన్నెలాటలు | చొక్కాకుల వెంకట ప్రసాద్ | 48 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధరరావు | 49 |
| | | | | |
| 2008 | 7 | అంతర్ముఖం | పి.వాణి | 51 |
| | | ఎదురుచూపులు | వింజమూరి రాగసుధ | 52 |
| | | నువ్వూ - నేనూ | స్వాతి శ్రీపాద | 53 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధరరావు | 54 |
| | | | | |
| 2008 | 8 | ఆశాజీవనం | మోహన్ చైతన్య | 55 |
| | | అడుగు | బాషా | 55 |
| | | పల్లె తల్లి గుండెకోత | చొక్కాకుల వెంకట ప్రసాద్ | 57 |
| | | తోడు-జాడ | వింజమూరి రాగసుధ | 58 |
| | | నానీలు | జి.స.నా.రా | 59 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధరరావు | 60 |
| | | | | |

| | | | | |
|---|---|---|---|---|
| 2008 | 9 | బలి పశువు | ఆకుండి విజయ కుమార్ | 61 |
| | | చిత్రం! | అ. సూర్యం | 62 |
| | | అమ్మ చేతి గాజులు | పెరుగు రామకృష్ణ | 63 |
| | | రసరేఖలు | బచ్పోటి శ్రీధరరావు | 64 |
| | | | | |
| 2008 | 10 | స్మృతి పరిమళం | తమస్విని | 66 |
| | | ఇంటిని వెదుక్కుంటూ... | రామా చంద్రమౌళి | 67 |
| | | నేను కాని నేను | కోడూరు శ్రీవేంకటేశ్వర స్వామి | 68 |
| | | నవ మల్లిక | వింజమూరి రాగసుధ | 69 |
| | | రసరేఖలు | బచ్పోటి శ్రీధరరావు | 70 |
| | | నానీలు | గోపరాజు రాధాకృష్ణ | 71 |
| | | | | |
| 2008 | 11 | దారి చూపిన దేవత | వేమూరి కృష్ణ, | 72 |
| | | వజ్రకిరీటం వర్షం | పెరుగు రామకృష్ణ | 73 |
| | | వసంత నేస్తం | వింజమూరి రాగసుధ | 74 |
| | | మరణశయ్య | పెండ్యాల వెంకటేశ్వరరావు | 74 |
| | | గువ్వ ఎగిరిపోయినా... గూడు నిదుర పోవునా!?... | తమస్విని | 75 |
| | | రసరేఖలు | బచ్పోటి శ్రీధరరావు | 76 |
| | | | | |
| 2008 | 12 | వందనం | రవి కిరణం | 78 |
| | | మొదటి పలుకు | భరద్వాజ్ దుగ్గరాజు | 79 |
| | | ధనమా! | పవన్ కుమార్ మొంగవరం | 79 |
| | | నెచ్చెలీ! | కోడూరు శ్రీ వేంకటేశ్వర స్వామి | 80 |
| | | కలుపు | బాషా | 80 |
| | | రసరేఖలు | బచ్పోటి శ్రీధరరావు | 81 |
| | | పచ్చచీర | తమస్విని | 82 |
| | | వర్ణనాతీతము | అపర్ణ (మునుకుట్ల)గునుపూడి | 83 |

# ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

## పాచికల సాగు

కె.వి.వి.రావ్ , విజయనగరం



కాంక్రీటు పుట్టలో ట్రాఫిక్ మెలికలై ఇరుక్కోలేని
నగరం నాగుపామై సాగుతోంది----
గొట్టాలుగా విస్తరిల్లిన దాహపు నాలుకతో వాగుల్ని దిగమింగుతూ !
నకనకలాడుతున్న ఆకలి పేగు చాపి సాగుభూముల సారాన్ని చప్పరిస్తూ!
పోష్ కాలనీలై పెరుగుతున్న పొట్ట కోసమై పల్లెల్ని కోడి పిల్లల్లా గుటుక్కుమంటూ!
గ్రామం నాలుగు వీధుల్నీ
నగరం నగ్న బాహువుల్లో నలిపేస్తోంది.
చేల చర్మాన్ని చీల్చిన నాగళ్ళు
ఇసుకతో ఇటుకల్నంటించే తాపీలవుతున్నాయి.
పట్టుపై జరీముగ్గులేసిన మగ్గాలు
ఎక్స్ప్రెస్ హైవేలకి తారుతాపుతున్నాయి.
ఎడ్లబళ్ళకి ఊపిరోసిన సుత్తిశానాలు
అపార్టుమెంట్ల గేట్లకాడ గస్తీ కుక్కలవుతున్నాయి.
సేద్యసేవలో గంజి వార్చుకునే చేతిపనులు
మెకానిక్కు షాపుల గోడలకి వేలాడే రెంచీల సంచీలవుతున్నాయి

ఓ నాటి గ్రామం సంక్రాంతి గేయం!
ఇప్పుడది ఓ సంగ్రామ గాయం!
పల్లె వేపచెట్టుని
పంఖా కూలర్లు తాకట్టు పెట్టుకుంటున్నాయి.
సల్లన్నపు ఉట్టిని
బ్రెడ్డుజాములు నంజుకుతింటున్నాయి.
విత్తిన వడ్లగింజనో వజ్రంలా మార్చే
మాగాణాల ఆశయంపై విమానాశ్రయాలు రెక్కలు చాస్తున్నాయి.
జానపదం, జేబులో రింగుటోనై పాదుగుతున్న నగరం
రింగురోడ్ల రంగుల వలలో పొలుగు పారలతో ఓ దళార్ల దళాన్ని నిర్మిస్తోంది.
గిట్టలగుంపులో నలిగే బురద పాదాలకి
బూటు తొడిగిన స్వేచ్ఛావాణిజ్య స్వేదం
బంగారు ముంతల్లో కల్తె గంతులేస్తోంది.
వెదురు తడకల తండాల్లో
వెన్నీసు బ్రాండులు తాండవమాడుతున్నాయి..
చుట్టకంపుతో సూపర్ కంప్యూటరు
చుట్టరికం కలుపుకోమంటుంది..
బూతుల మూతుల్లో కొలపాతాలు
కొసరి కొసరి పిజ్జాలు కూరుతున్నాయి..
గూన పెంకు కొంపల పెరట్లో
మెర్సిడస్‌లు మేకలై మేస్తున్నాయి..
పేడ మేగిన పేరంటపు పందిట్లో
డాలరు డోలు వాయిస్తోంది..
పందెపు కోళ్ళ కొప్పులపైకి
కోట్లు నిచ్చెన మెట్లేసుకుంటున్నాయి..
పాలిథిన్ పొదుగు కుడిచి ఎదుగుతున్న పాడికావిడ్ని చూసి
మినరల్ సీసాల్తో మడిచెల్కలు మడి స్నానమాడుతున్నాయి.
నల్లకరన్సీతో నలుగెట్టుకుంటున్న మన్నుని చూసి
తరాజుల్లోని కాయగూరలు తారాజువ్వలై ఎగురుతున్నాయి..
గొడ్డూ గోదా కోల్పోయిన రైతుల్తో గోళ్ళు కొరికిస్తూ
గోళీకరణం గోలీలాడుతోంది..

పైర్లు పాకిన నేలపై
ఇనుమూ ఇటుకల విత్తుల్లోంచీ విచ్చుకొచ్చిన
నింగెత్తు సైబరు సౌధాల పాదాల కాడ
నిశాని మరకలుగా నిలబడిన నిరాశ్రితులు
నోట్ల కట్ట నోట్లో చిక్కిన కలలై
బువ్వ దొరికే తొవ్వ కోసం
దుఃఖపు చేళ్ళని దున్నుకుంటున్నారు-
షేరుల పేరున దస్తావేజులకెక్కుతున్న ధాన్యపు గింజల్ని చూస్తూ!!

xxxxxx

## మరణమొక విషాదం కాదు...

- పెరుగు రామకృష్ణ,నెల్లూరు



Death in life is not the greatest loss in life. The greatest loss is what dies inside us while we live – Norman Couris

ఇప్పటికిది ఎన్నో మరణమో
తేల్చి చెప్పాల్సిన అగత్యం లేదు
లెక్కగట్టాల్సిన అనివార్యతా లేదు ..
ఏదో ఒక సందర్భంగానో, అసందర్భంగానో
రోజూ మరణించడమే..
జీవితానికి కొత్త శ్వాసై పోయిన చోట
మరణించడం తప్పనిసరి ప్రక్రియ
మరణించిన మూడోరోజు నిద్రలేపడమే
కదా..
ఒక సనాతన జీవచైతన్య ప్రయాణం
ఒక నమ్మకం మరణించినప్పుడు
ఉఛ్వాసా నిశ్వాసాల రణంలో
నిరంతర యాతాయాత చక్రభ్రమణంలో
మనిషి బతికే వుంటాడొక చావుతో..



ఒక జీవితాశయాల ఆశ
నిరాశలోకి పరకాయ ప్రవేశం చేశాక
నడుస్తూ పడుతూ లేస్తూ
మనిషిలో మృత్యువు జెండా ఎగరేస్తుంది..
జీవితమంటే మరణాల సమూహమే
ప్రతి విషాదమూ వొక మరణమే..
మమతల్ని కోల్పోవడం
అనుబంధాల్ని తెంచుకోవడం
స్నేహబంధాల్ని విరమించడం
చావునడిచిన అడుగుల జాడలే..
మరణిస్తూ బతికుండటమే కదా
కాలానికి పరిచయవాక్యం..
చరిత్ర నిండా రణాల మరణాల రహస్యాలే
ఒక మరణించిన అంతఃపురం
నిర్జీవకళా శైథిల్యం
ఒక పురాతన మరణానికి తురాయి..
ఇప్పుడక్కడ బతికిన చిరునవ్వుల్లేవు
ఆజ్ఞల్లేవు, నిరంకుశ అహంకారాల్లేవు
అక్కడి మందిరాల్లో, మసీదుల్లో కొలిచి పూజించిన దేవుడూ మరణించాడు..
కేవలం వారసత్వమే బతికుంది
ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడటమూ ఒక మరణమే..
మనిషి తన్ను తాను మరిస్తే శవమే
జీవచ్ఛవాలెన్ని బతకడం లేదు నిత్యం?
ఊపిరి పీల్చడమొక్కటే
బతికుండటానికి నిర్వచనం కాదు
మరణమొక విషాదమూ కాదు
తాజ్‌మహల్ బతికుందనుకుంటున్న వాళ్ళకి చెప్పండి
అక్కడ ప్రేమ మరణించి శతాబ్దాలైందని!

# పురుటి నొప్పులు

చొక్కాకుల వెంకట ప్రసాద్ , కెనడా



అనుభవాల బరువు
ఆశయాలకు భారమైంది

నమ్మిన నీతి సిద్ధాంతం
పునాదిరాళ్ళు,
అనుభవాల వత్తిళ్ళకు
ఒకటొకటిగ కీచు కీచు శబ్దాలతో
కదులుతూంటే



కొత్తకాల రీతులకు
నిలువలేని పాతనీతి
సిద్ధాంతం
తనను తానే, తనకు
తానే
మార్చుకునే వేళ

కొత్త పురిటినొప్పులు
గర్భాశయపు వొత్తిళ్ళకు
మేనంతా నొప్పులు

నమ్మిన సిద్ధాంతంతో
నమ్మలేని నిజాలు
కాలగమనంలో
మారిపోయిన విలువలు
ముఖాముఖిగా ఢీకొంటే
పైకుబికొచ్చిన మొదట్లో
సవాలక్ష ప్రశ్నలు

సిద్ధాంతపు ఉనికినీ,అస్థిత్వాన్నీ
సవాల్ చేసి ప్రశ్నలు కొన్నీ
సిద్ధాంతపు నవీణీకరణకు
మార్గం చూపుతూ
రాబోయే కాలాలకి నిలబెట్టే
దిశా నిర్దేశాలు ప్రశ్నలు మరికొన్నీ

మస్థిష్కపు అంతరాల్లోనూ
నొప్పులు
శతకోటి ప్రశ్నలకు జవాబు
వెదికే యత్నంలో
మస్తిష్కపు అంతరాల్లోనూ
నొప్పులు

## మాతృభాష

- కృష్ణ అక్కులు

పిల్లలు ఆంగ్లం
మాటలాడితే
తల్లితండ్రులకు ఖుషీ
తెలుగయితే నామోషీ

ఇంగ్లీషు అంటే తెల్లగుందని
కన్నతల్లి నల్లగుందని
తల్లిని చెల్లదందువా

ఎదురింటి వాడిని
నీబిడ్డ డాడియనిన

విని భరించెదవా
మరి అమ్మలాంటి నీ భాషని
నీ బిడ్డ పలకకున్న
ఎలా సహించెదవో

పరభాషా వ్యామోహం కాదు నేరం
స్వభాష విస్మరణం మహా పాపం

నన్నయ, పెద్దన ఎందరో పెద్దకవులు
సంస్కృతాంధ్రాలలో గొప్పపండితులు
తెలుగు మాధుర్యంగని వారు రాయలేదా
తెలుగులోనే కావ్యాలు

తుళువ రాజైన రాయలు చెప్పలేదా
తెలుగు గొప్ప యని
ఆంగ్లేయ బ్రౌన్ దొర గ్రోలలేదా
తెలుగు మకరందాన్ని

తమిళనాట త్యాగయ్య తేనెలూట కీర్తనలు
పాడలేదా తెలుగులోన
సుందర తెలుగని నుతించలేదా
భారతీ యార్

అటువంటి దివ్యభాష మాట్లాడటం ఒక వరం
మాట్లాడలేకపోవడం దురదృష్టకరం
అది నీ దుస్థితిగాని
తెలుగుకు పట్టిన దుర్గతి కాదు

## రసరేఖలు

-బచ్చోటి శ్రీదరరావు



ఇది విశాల గగన పథమిందు నేడు
పాలు గుమ్మరించినయట్లు పలుచని పొర
వంటి కాంతి వలయమొండు వరలు చుండె
నింగి నెల్లను చుక్కలు నిండియుండ

యామవతి వేళ చల్లని యాకసమున
తారలెన్నియొ కాంతుల దారములను
నిచ్చెనలు వేసె నిలనుండీ నింగి వరకు
పాదపద్మములిందుపై బరపుడనుచు



తేలిపోవుచు నొండొరుకేలుగొనుచు
పోవుచుంటిమి తారల పూవులెన్నో
పరిమళాసారములు మనపైన కురియ
దివ్యపరితోషరసమయ దీప్తి మునిగి


నల్లవలువమీద తెల్లని చుక్కలై
ఆకసాన తారల మరె నేడు
శోభలొలుకు మేన సుందర వస్త్రమ్ము
చేసి ఇచ్చె నీకు సృష్టికర్త

విశ్వమందితరములు స్తంభించి పోయె
శాశ్వత మిహపరములనీ క్షణమొకటియొ
ఈ గగన వీధిలో విహరించుకొనుచు
గడపివైచెద మెల్ల యుగమ్ములిట్లు

# ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

## సాపేక్షం

- సుదేరా



చక్రాన్ని ఆవిష్కరించినప్పుడే
చరిత్ర భ్రమణం మొదలెట్టిందిగదా!
నాగలి నిర్మించినప్పుడే
నాగరికత నడక ఆరంభించిందిగదా!
ఫలాన్ని పంటితో కొరికినప్పుడే
మొండిమొలపై సిగ్గులు చిగురించాయిగదా!
రాతిని రాతితో రాపిడి చేసినప్పుడే
పాతయుగం సరికొత్త రాగం పాడిందిగదా!
ఇప్పుడు - ఎత్తుకి ఎదిగాక కిందకి చూస్తే
బువ్వపెట్టే భూమి బురదముద్దలా చీదరేస్తుంది.
ముక్కాలి దుఃఖం ముక్కుల్లో రుమాలు దోపే ముసలి కంపవుతుంది.
సేద్యానికి స్వేదమే ఇంధనమైన కల
సైబరు సమరంలో క్షతగాత్రమవుతోంది
సాత్వకంగా సాగని తాత్వికాలోచనలు
తవ్వకాల్లోని శిలాజ రుజువులతో
శిరోజాల్ని తెలుపు చేసుకుంటున్నాయి
ఆప్యాయం కరువైన వృద్ధాప్యం

అపాయాన్ని ఆలింగనం చేసుకుని
మృత్యువుని ముద్దులడుగుతోంది
ఎడారిగా ఎండుకు పోయిన వయస్సులో
ఒంటరి ఒయాసిస్సుగా వెలసిన మౌనసాహచర్యం
సుస్తీ పడిన మనస్సుని సున్నితంగా మీటుతోంది
ఎడమకు కుడి తోడుగా ఎడదలో నడిచిన ఏడడుగులు
కనుపాపలపై ఇంకని మడుగులుగా
జ్ఞాపకాలను దహిస్తూనే ఉంటాయి
ఎర్ర రక్తకణాలు ఆవిరైన శిశిర శరీరం
చేతికర్రపై మోపిన చూపుల్లో వణికిపోతుంటుంది.
సెల్‌పలకరింపు లెన్నైనా
సెలేసిన గాయాల మూటకి
పరిచర్య కాలేవు కదా!
మూలుగెండిన బొమికల గూటికి
మెతుకుల బొచ్చె అందిస్తున్న
ఆశ్రమ వ్యాపారానికి
పేగు పీకుడు కనికరాలు
సెయ్యినాకుడు మమకారాలు వుండవు కదా!
నాగేటి కర్రు విరిగి ఒకటి -
ఊత కర్ర చేజారినదొకటి -
వ్యవసాయానికి
అవసానానికి
ఎంత సాపత్యమో?!

# గ్లోబల్ పతంగి

- రవి కిరణం



నా మదిలో రంగుల పతంగులు
జ్ఞాపకాల పరవళ్ళు..
నా శ్రీమతి ముత్యాల ముగ్గుల్లో
మెరుస్తున్న వాకిళ్ళు..

పొద్దున్నే 'హేపీ పొంగల్' పలకరింపు
ఇంగిలీసు మాటల్లో..
సంక్రాంతిని పొంగల్ గా మార్చిన పెద్దోడినుండి ఫోను..
అమ్మకి కూడా అలాగే చెప్పమన్నాడు
మన వాకిటి ముత్యాల ముగ్గులు
ఫోటోల్లో చూస్తానని శెలవిచ్చాడు..
మరి అమెరికాలో సెలవుండదట..!
తనకేమో 'యమ' సెట్టు ఉందంటూ
వేకువనే క్రాష్ కోర్సులకి చిన్నోడి పరుగులు

'డర్టీ కౌ డంగ్' దాటుకుంటూ
'జావ' క్లాసేమో ఉందంటూ..యంత్రాల భాషార్జనలో
భవిత కంప్యూటర్ డబ్బాలోనే ఉందంటూ..ఉరుకులు..
నిలబడే తింటూ ..అదే ఫాస్ట్‌ఫుడ్ అంటూ
నిన్నటిలోకపు 'మమ్మీ' కి 'బై..బై..' అంటూ మా అమ్మాయి

చందనలో తెచ్చిన పట్టు పరికిణీ
అరెస్ లో తెచ్చిన ట్రిగ్గర్ జీన్స్
కదలకుండా టేబుల్ మీద..నన్నే చూస్తూ..!
కాలం మారిందంట..వేగం పెరిగిందంట..
ఎగిరి పోతోంది.."గ్లోబల్ పతంగి"
మానవ సంబంధాల 'మాంజా' తెంచుకుని...!

## నేనే నేనై..!

-మోహన్ చైతన్య



నిన్న...
నైరాశ్యపు చలిగుబుళ్ళలో
కన్నీళ్ళు నిండిన దోసిళ్ళతో
తెరచుకుని గుండె వాకిళ్ళను
నిస్తేజంగా.....
నేడు....
చిగురాకుల ఉషోదయంలో
చీకటి సంకెళ్ళను ఛేదించుకుంటూ
సుదూర గమ్య శిఖరాల దిశగా
ఓ చిన్ని కదలిక..
రేపు...
ప్రదీప్త, ప్రజ్వలనా జ్వలిత
జ్వాలా మాలికా తరంగాన్నై...
రవికిరణాన్నై, శశిబింబాన్నై
దూరం దూరంగా పై పై ఆకాశంలో
నేను నేనై...
ఆనందంగా నేనే నేనై ..!

## జరాభూతం

- తమస్విని

మూసిన కనురెప్పల మాటున గతకాలపు వైభవాల పరదా
మసకబారిన గాజుకళ్ళ వెనక వెల్లువలా ముంచెత్తుతున్న
జ్ఞాపకాల వరద! అప్పటి నేను ఠీవిగా, దర్పంగా
ఎవరినీ లెక్క చెయ్యని ఓ విధమైన పొగరుతో,
రాజులా రారాజులా, భావించిన ప్రవర్తించిన కాలమేది?
ఇప్పటి నేను - దీనంగా, దరిద్రంగా ఎవరికీ లెక్కలో లేకుండా,

ఓ విధమయిన భీతితో ఉలికులికి పడుతూ, చావు రాదని
బాధపడుతూ చావు వస్తుందేమో అని భయపడుతూ,
అర్ధరాత్రి అసంకల్పితంగా మెలుకువ వస్తే చీకటి మాటున
నిశ్శబ్దంగా తలలూస్తున్న వృక్షాలు దయ్యాన్ని తలపిస్తూంటే,
కొన్ని రోజుల్లో నేనూ దయ్యానౌతానేమో అన్న భయంతో,
కన్ను మూస్తే మృత్యువు కంబళిస్తుందేమోనన్న వెర్రిభ్రమతో,
కళ్ళల్లో వత్తులు వేసుకుంటున్నట్లు మెలుకువగానే రాత్రంతా
అచ్చం నలభై ఏళ్ళనాటి తన భార్యలా!!



క్లబ్బుల్లో పేకాడుతూ, గర్ల్‌ఫ్రెండ్స్ ముందు సూపర్‌మేన్‌లా ఫీలవుతూ,
గంటల్ని క్షణాల్లా కరింగించేసి అర్ధరాత్రో, అపరాత్రో ఇంటికి చేరే తనకి..
నిద్రమొహం పెళ్ళాం దరిద్రంగా తోచేది
కానీ అక్కడ తనకి క్షణాలైన గంటలు ఇక్కడ క్షణమొక గంట!
ఆ నిజం ఇప్పుడిప్పుడే బోధపడి ఒంటరితనం అంటే
కాలానికీ అలుసే, నిదానంగా నడుస్తుంది అని
భార్యతో సంజాయిషీ చెప్దామంటే,
తను నిద్రల్లేని రాత్రులు గడిపీ, గడిపీ శాశ్వత నిద్రలోకి పోయి పదేళ్ళయింది!!
బంగారంలాంటి బాల్యం; అస్పష్టతలోని ఆనందం కౌమారం
జీవితంలో అత్యంత మధురమైన యవ్వనం
అన్నీ వెళ్ళిపోయాయి!
ఇంతవరకు పరుగు పరుగున ప్రయాణించిన జీవితపు రైలు బండి
వృద్ధాప్యపు స్టేషన్ నుండీ మృత్యువనే గమ్యం వైపు నిదానంగా నడుస్తోంది!
పత్రికల్లో ఆత్మహత్యల గురించి చదివినప్పుడల్లా ఆశ్చర్యం,
అలా ప్రాణమెలా తీసుకుంటారో!
వాళ్ళ ఆయుష్షు కూడా తనకిస్తే బాగుండు భగవంతుడు!!
పనీపాటా లేక వెర్రి మొర్రి ఆలోచనలు!!!
'ఏ కాలంలోనైనా, ఏ సమయంలోనైనా ఈ మూలగదిలో
ఒంటరిగా కూర్చొని నీలో నువ్వు నవ్వుకుంటుంటావు
తాతయ్యా, నీకు భూతాళంటే భయంలేదా?'
విస్ఫారిత నేత్రాలతో అడుగుతున్నాడు మనవడు
'లేదురా, ఈ ముసలితనపు భూతమంటే భయం
చంపేస్తుందేమో అని భయం; ఇంకా చంపలేదేంటి?

అని అసహనం; ఎప్పుడు చంపుతుందో అని దిగులు
ప్రపంచంలో అన్నింటికంటే భయంకరమైనది
ఈ జరాభూతంరా '...నిట్టూర్చాడు తాత

## నేను

- డా.ప్రభా ఆత్రేయ

స్త్రీగా జ్వలిస్తా!
ఆ జ్వాల ఓ లీలగా నీవు రగిలించిన కీల!!
నాలోని నేను
వర్షఛ్ఛాయా నిశీధిలో
క్షణం వెలిగే సౌదామినిని!!
నాలోని ఆవేశాలు
ఒక నిమిషం మిరుమిట్లు గొలిపి
మరునిమిషం మరణించే విద్యుల్లతలు!!
నాలోని ఆకాంక్షల ఆశలు
రగిలి పొగిలి ఒక దానిలో ఒకటిగా
ఒదిగిపోయే ఆరావళీ పంక్తులు!!
నాలో లోలోపలి నేత్రం
ఆకాశపు గుమ్మంలో
సంధ్య వెలుగుల నక్షత్రం!!
వేసవి వానలో రంగుల విల్లు
శ్రావణ మాసపు వెన్నెల జల్లు
వడలిన పండుటాకుల వెనుక
అణగిన ఎండుటాకులు
తొలకరిలో పులకరించి
తొంగి చూసే లేచిగుళ్ళు
ముసిరే మబ్బుల్లో మలిగే ఆకాశం



ఈ క్షణపు వర్తమానం .. మరోక్షణపు భావికాలం
క్షితిజ రేఖపై క్షణం క్షణం
దిగంతాలలోకి దిగిపోయే సూర్యబింబం
చీకటి చెరుగున మెరిసిపడే గులాబి వర్ణం
నేను అవుతున్నాను!
ఈ ప్రపంచానికి వెలుగౌతున్నాను

## రసరేఖలు

- బచ్చోటి శ్రీధరరావు





ఇంత నిశ్శబ్దముగనున్న నీ నిశీధి
నొంటరిగ సాగిపోవుచునుంటి నేను
వలపు నిండిన గుండె సవ్వడి యనంగ
సడిని చేయుచు సెలయేరు సాగుచుండె

ఈ నిశీధిలో నీ సెలయేటి బాట
పలుకరించెడు నక్షత్ర పంక్తి క్రింద
నిశ్చలానంద మీ ఎద నిండియుండ
అరుగుచున్నాను ఒంటరి నగుచు నేను

ఇచట నడచెడు నను సెలయేరు చూచి
పిలిచి చెవిలోన గుసగుసల్ పలుకుచుండె
పలుకుచున్నది సెలయేరు - స్వాంత మందు
అబ్ధి వీచికల్ కదలాడినట్టులుండె

ఎన్ని తారలో యీ సెలయేట మెరయు
వెలుగు రేకలు తలపించె చెలియ కనుల
ఉన్న కనుదోయి చూడగానొకటె నాకు
ఇన్ని కన్నులతో కన్ను కలుపుటెట్లు

# ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

చిత్రాలు:రఘునాథ్ దెందుకూరి

## 'భూ గ్రామ' దేవత జాతర

'యశ్వంత్'



బిక్కు బిక్కుమంటూ గుహల్లో తలదాచుకున్న నాటి నుంచీ
ఒక్క క్లిక్కుతో 'గూగో'ళంలో ప్రవేశించే వరకు -
పచ్చి మాంసాన్ని భక్షించిన నాటి నుంచి
ఛప్పన్నారు దేశాలకూ పిజ్జా బర్గర్లను మప్పే వరకు -
చీమలుదూరని కారడవుల సంచారం నుంచీ
స్పేస్‌వాక్‌లో సరికొత్త రికార్డులు సృష్టించే వరకు -
సిగ్గెరగని నగ్నత్వం నుంచీ
కార్గో జీన్ కల్చర్ వరకు -
- అహా! ఎంత పురోగమనం!
పరమాత్ముడు శిరమెత్తి చూస్తే
కిరీటం జారిపడే ఎత్తులో
మానవ జయకేతనం!

అరే! అంతటి అజేయుల అజమాయిషీలోనూ
మానవలోకం 'యానిమల్' ప్లానెట్‌గానే ఉందే!
ఇదేమిటిది ఇక్కడ -
పసిపాపలు పరమాత్మలంటూనే

బాల్యాన్ని బలిపీఠం పైకి విసురుతున్నారు!
దేహపుటవసరాలకు హద్దే లేదంటూ
హృదయాన్ని కటకటాల్లోకి నెడుతున్నారు!
దేవుని ఊపిరి వంటి సంగీతాన్నీ
సరుకుగా మార్చేస్తున్నారు!
నీటిని పిండి సొమ్ము మూట కట్టుకోవడం
మానవ ప్రస్థానంలో గొప్ప మెట్టంటున్నారు!
ఇదేమిటిక్కడ ఇప్పుడు -
ప్రాణవాయువులను వెలివేస్తున్నారు!
సూర్యులకు శిలువ వేస్తున్నారు!
బోధిచెట్టును వంట కట్టెలుగా విక్రయిస్తున్నారు!
తరతరాలుగా మెరుగులు దీరిన బుద్ధులను
' భూగ్రామ ' దేవత జాతరలో బలి ఇస్తున్నారు!

మానవాళి ప్రగతి -
అస్థిపంజరం ధరించిన పూదండేనా?
ఈ జయజయధ్వానాలు -
లేళ్ళను, లేగలనూ మింగిన కొండచిలువ
తేన్పులేనా?


కరదీపికలకు కొరతలేదు -
అయినా పయనం దారి తప్పింది!
విరితోటలకు కరువు లేదు -
అయినా పరిమళం ఇగిరి పోయింది!
కాంతికి కారుణ్యాన్ని అంటకట్టుకుంటే -
పూలలో పరిమళాన్ని నింపకుంటే -
పశువులే ఫక్కుమంటాయి, పారా హుషార్


## సార్ధకత

-స్వర్గీయ డా.పులికంటి కృష్ణారెడ్డి

విప్లవాన్ని నెమరేస్తూ అభ్యుదయాన్ని శ్వాశిస్తూ
స్వార్ధశక్తుల్ని శపిస్తూ ఈ వ్యవస్థను శాసిస్తూ
ఆరాధనా అభినుతులందుకునే మహాకవివే కావచ్చు!

కళామ తల్లి సేవలో జీవితం కర్పూరమై కరిగితే
అభిమానం మూలాల అంతును
అనుభవానికి తెచ్చుకుని ఆనందించిన
అగ్రశేణి కళాకారుడివి కావచ్చు!





కాగితాల శిలాఫలకాలపై కలం ఉలితో
వెతల బతుకుల కన్నీటి కతల్ని
కథా శిల్పాలుగా మలిచే శిల్పి కావచ్చు!

గుండె బరువు కండ్లల్లో కరిగితే
పరవశం - కనురెప్పల పరదాలపై
తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తుంటే
ఆ పాతమధుర గానామృతాన్ని
గొంతు పళ్ళాల్లో నింపి జురించే
గానగంధర్వుడే కావచ్చు!

అనుభవాల్ని ఆశయాల పంటలుగా పండించి
ప్రగతి కుంపట్ల మీద వండివార్చిన
రకరకాల సాహితీ వంటకాల్లో
అప్పనంగా రుచులను చప్పరిస్తూ
తప్పులకై తారాడి మెప్పులు భుజించే
తలపండిన మేధావివే కావచ్చు!

చంద్రుని శిరస్సుపై కాలూని
సూర్యుడితో కరచాలనం చేసే విశ్వప్రయత్నంలో
అంతరిక్షాన్ని 'ఆఫ్రో' క్రీడావనిగా మార్చుకున్న
మహాశాస్త్రవేత్తవూ కావచ్చు!

మట్టికి మనసిచ్చి ప్రేమించి
అక్కున చేర్చుకుని అహోరాత్రాలు లాలించి
కడుపు పంటను పండించి అంత బువ్వపెట్టే
దేశం దేహానికి వెన్నెముకవే కావచ్చు!

ఎవరు ఎవరైనా ప్రాథమికంగా మనిషి
జానెడు పొట్ట ఇంద్రజాలంలో ఇరుక్కుని
ఇరుకు మనస్థత్వంతో ఎదగాలనుకుంటూ
స్వార్థం చేతుల్లో తెలివిగా ఒదిగిపోతూ -

మనిషి ఎదగడానికి హద్దు ఆకాశమైతే
మనస్సు ఆకాశంతో పోటీపడుతూ -
విస్మరింపరాని ఈ కఠోరవాస్తవం
నిర్దయ పాద ఘట్టనల కిందపడి నిరంతరం నలుగుతుంటే -
అడుగు తడబడుతూ, నడత నాణ్యత మడత పడుతూ -
మార్పుకోసరం తూర్పుదిక్కుతో పోటీ పడుతూ
మానసాకాశంలో కోర్కెల చుక్కల్ని కాలరాస్తూ
త్యాగం సూర్యుణ్ణి మానవతా చంద్రుణ్ణి
ఉదయింప చేస్తేనే కదా? - జన్మసార్థకత!

## పార్టీ అయిన తర్వాత

- తమస్విని

ఆఖరి అతిథి కారు వెళ్ళిన చప్పుడు వినగానే రిలీఫ్‌తో కూడిన నిశ్వాసం!
జిలుగు దుస్తులు హేంగర్లపై విశ్రాంతి తీసుకుంటాయి
కొడిగట్టిన దీపంలా సెంటు వాసన కొస ప్రాణంతో అంటుకుని ఉంటుంది
యుద్ధానంతర రణరంగంలా హాలు రూపు సంతరించుకుంటుంది
నాజూకుగా సగం వదిలేయబడ్డ కేకు ముక్క దీనంగా చూస్తూంటుంది
కెలికి వదిలేయబడ్డ అన్నం పళ్ళాలు నిండుగా అలరారుతూ
భారతదేశ బీదరికాన్ని హేళన చేస్తూంటాయి!
దొర్లిన గ్లాసులోంచి జారిన నీళ్ళు దేశ పటాలను
పాలరాతి నేలపై వంపులు తిరుగుతూ చిత్రిస్తుంటాయి
లెఫ్టోవర్స్‌తో టేబుల్ క్షతగాత్రుడిలా వెలవెలబోతుంది
అన్ని పదార్థాల వాసనలు కలిసి ఓ విధమైన
వెగటు వాసనని వెలువరిస్తూంటాయి
చిరుగుల పరికిణీపై జిలుగులు ఓణీలా బహుమతులన్నీ
ఓ మూల హుందాగా పరచుకుని ఉంటాయి
సాయంత్రం నుండి షేక్ హేండ్స్‌తోనూ నమస్కారాలతోనూ
అలసిపోయిన చేతులు మా వల్లకాదంటూ మొరాయిస్తాయి
'కమాన్ డార్లింగ్ లెటజ్ ఎంజాయ్' మగ కంఠం కాంక్షగా పిలుస్తుంది
'ఇక చాలు' అంటూ మనసు మారాం చేస్తుంది
హాలుని చూస్తున్న నిస్సహాయత నిర్లిప్తతగా మారుతుంది
యాంత్రికంగా కాళ్ళు బెడ్‌రూంలోకి నడుస్తాయి
గోరువెచ్చని నీరు అలసటని తగ్గించడానికి తమ వంతు సాయం చేస్తాయి
ఆత్రంగా ఎదురు చూస్తున్న చేతులు బలంగా అల్లుకుపోతాయి
సెంటు వాసన, విస్కీ వాసన కలిసిన వదరు వాసన కడుపుని అల్లకల్లోలం చేస్తుంది
వెలికి రాబోతున్న వాంతిని సభ్యత బలవంతంగా అదిమి పెడుతుంది
పెనవేసిన చేతులు కొద్దిసేపటికి పట్టు సడలగానే
ఉగ్గుపట్టుకున్న మనసు పక్కకి తిరుగుతుంది



'చూసావా నీ బర్త్‌డే ఎంత బాగా సెలబ్రేట్ చేసానో'
గర్వంతో కూడిన పురుష కంఠం మత్తుగా పలుకుతుంది
కళ్ళ ముందు భోజనాల గది తళుక్కున మెరిసి మాయమవుతుంది
అలసిన తనువుని నిద్ర నెమ్మదిగా జోకొడుతుంది

## పాప

- ఉమ చింతలపాటి

నీలి మబ్బులో దాక్కున్న అందాల తారకా
మా పాప కన్నుల చమక్కులా మెరిసి మురిపోవా

కొండ మలుపులో చిక్కుకున్న పరవాల సెలయేరా
మా పాప నడకలా ఒక్కసారి ఛెంగున దూకి సాగవా

స్థంబించి చూసేటి చిరుగాలీ
మా పాప చేతి స్పర్శలా చక్కిలిగింతలు పెట్ట వచ్చావా

లేలేత తీగల మాటున పొంచిన చిన్నారి మల్లె మొగ్గా
మా పాప మేని గంధంలా పరిమళాలు వెదచల్లేవా

మావి చిగురు తిని ఆదమరచి నిద్రపోతున్న కోకిల
మా పాపా మాటలా నీ పంచమ సుమస్వరాన్ని వినిపించావా

ఎన్నో అద్భుతాలని నింపుకున్న ప్రకృతి
మా పాప వేసిన బొమ్మలా నీలో రంగులన్నీ చూపావా


పరుగు పరుగులా జీవితంలో అలసిపోతున్న ఓ మానవా
మా పాప అందించే తియ్యని బంధంలా నీ ప్రేమని ఈ లోకానికి పంచావా!

## రసరేఖలు

- బచ్చోటి శ్రీధరరావు

నీ గృహ ప్రాంగణమునకే నేగుదెంచి
నిర్మల ప్రేమమూర్తివౌ నిన్ను చూడ
వికచనేత్రమ్ముల వెదకు వేళ - శోక
మూర్తివై నిల్చినావొక మూల నీవు

కమలముల కాంతి చెలువొందు కనులయందు
నిలిచి ప్రవహించుచుండె కన్నీరు నేడు
వాలుచూపుల మెరయు నేత్రాలు నేడు
జీవమేలేక కలతను చెందుచుండె



సుందర స్మిత వదనారవిందమపుడు
నాదు సర్వస్వమును దోచినది నిజమ్మొ
నేడు వేదన నిండు కన్నీరు నాప
ఇంకనేమైన నర్పింపనెంచుచుంటి

ఇందువదనాన నవ్వులు చిందువేళ
ఎడదలో నుండీ యనురాగమొసగి వచ్చె
అందు వెత మబ్బులెన్నో నేడావరింప
హృదయమె కరిగి నీరైనదేమియందు

నీదు నిట్టూర్పు గానమై నించునెదను
మాలయైజేరు బాష్పముత్యాలు నన్ను
ప్రేమయును నీకుతోడునై వేదనయును
హృదయమందొక్కసారి పొందెదను నేను

## వసంత పంచమి - రవి కిరణం





"నారీజన" కురుల వర్ణనలో
"నరుల మెప్పు" ఆశల జడిలో
మాయ కప్పిన చీకటిలోన
దారి తెలియక పయనిస్తున్నా

కాసుల గల గల రమ్మంటుంటే
కడుపు తీపికి బానిస అయ్యి
నాలుగురోజుల "నాటకమంటు"
ప్రశంస కోసం "నటించుతున్నా "

నీ "పదములై" పారనే లేదు
ఎదలో తడి "ఆరుతున్నది"
"నీ పాట" కొలను నింపనేలేదు
ఆశ "చెలమ" నిండుకున్నది

నీకై కలము ఇంక కదలక ముందే
జీవ "సిరా" నిండుకున్నది
నా కవనయజ్ఞమువ్వకముందే
మరణమొచ్చి రమ్మంటుంది

పలుకు నేర్పిన "బాసర" తల్లి
మరుజన్మలో కరుణిస్తావా!
నీ వీణలో తంత్రిగా పుట్టే
వరమొక్కటి ప్రసాదిస్తావా!

## కాలమా... ఆగిపో

- మోహన్ చైతన్య



ఆకాశం నలుదెసలూ
కలిసే నా మస్తిష్కం శిఖరాగ్రాన
నిలుచుని మరీ శాసిస్తున్నాను
'కాలప్రవాహమా'
ఆగిపో !!
నీ ప్రచండ వేగంలో
మేమేమీ గాంచలేకున్నాం!
నీ వరవడిలో ఉరుకుల్లో అంతా
అయోమయంగా గడిచిపోతోంది!!
నిర్నిమేషంగానే శతాబ్దాలను సైతం
సమాధి చేస్తూ పరిగెడుతున్నావ్!!
నీ పద ఘట్టనల హోరుల్లో
నలిగిపోతున్న మా గుండెలు
గతులు తప్పి అలిసిపోతున్నాయ్!
చేజారిన పూమాలల్ని అందుకొనేలోగానే
అంతులేని దూరాలకు లాక్కెళతావ్
అందుకే నిన్ను అర్థిస్తున్నా
ఆగిపో!
కనీసం కొద్ది క్షణాలయినా!
ఈ ఆనంద తన్మయతని
తనివి తీరా త్రాగాలని ఉంది

ఈ చల్లని, సుస్పందన ఉద్యానవనాల్లో
కొద్ది క్షణాలయినా సేద తీరనీ!!
ఈ కౌమార్యం మధుర క్షణాల్ని
మనసారా ఆస్వాదించనీ!!

## నెమరువేత

- స్వాతి శ్రీపాద





చుక్కలు చుక్కలుగా
బొట్లు బొట్లుగా
ధారలుగా మారి ఏళ్ళకేళ్ళు
నదులై సముద్రాలై
చివరకు దిగంతాల్ను మింగేసి
చిద్విలాసంగా చిర్నవ్వులు రువ్వే పారావతమై
ఆ ఒడ్డున నువ్వు నిశ్శబ్దం మంచు ముక్కలా
ఈ ఒడ్డున నేను మాటలు పెగలని మూగపుస్తకంలా..
కాలం ఘనీభవించిన కన్నీటి ప్రపంచంలా
సుషుప్తిలో నిద్రిస్తున్న ఓ అగ్నిశిఖలా
దారి తప్పిన భావాల్ను సరిచేసుకుంటూ
ఓడిపోయిన కలల్ను బుజ్జగిస్తూ
రాగద్వేషాల మధురిమల్ను సరి తూచుకుంటూ
కూపస్తమండూకాల్లా కనిపించని గోడల మధ్య
జీవితాలను భుజాన వేసుకుని
దొరికిన పరకనల్లా పట్టుకుని ఎంత ఈదినా
జారిపోయే మెట్లు ఎన్ని ఎక్కినా
అక్కడికే మళ్ళీ మళ్ళీ చేరుతూ
హఠాత్తుగా గోడల జాడలు అదృశ్యమై
రెక్కలొచ్చిన బాంధవ్యాలు
కొత్తింటి నిర్మాణంలో నిమగ్నమైన వేళ
కనిపించని రెక్కలు మొలిచిన స్వేచ్ఛలా
సైకత సాగరాల్ను దాటిన మనసు గతం ముంగిట్లో వాలి
జ్ఞాపకాల నెమరువేత

## నా తెలుగు పదం - సంజి శ్రీరామ్



కలం సారథై పద పదమని కదిలెను పద కదనానికి నా భావ రథం
ప్రతి తెలుగు పదం తను భాను బహువై చూపగా వెలుగు పథం
నుడికారమే నుదుట కుంకుమై, ఉపమాన మాన సమానమై
పదజాలమే పట్టు చీరగా, అంత్యప్రాసయే తన అలంకారమవగా
తెలుగుదనం తొణికిసలాడే "పదతరుణి" వంటి నా కవితలకు...
ఆరంభం, అంతం, ఆనందం, అందం అంతా అక్షర బంధంలోనే!
ఆకలి, ఆట, పాట అంతా అచ్చ తెనుగు అక్షర బృందంతోనే!!
పరభాషల ప్రభావాలు, పాశ్చాత్యపు పిశాచాలు
అంతటినీ అంతు చేయు ఆయుధమే నా తెలుగుపదం!!
పచ్చని పల్లెల శ్వాసలో, పలికే ప్రతి తెలుగోడి నాడిలో
వెచ్చగా వినిపించే పాటల స్వరమూలం నా తెలుగు పదం!!
చీకటి కమ్మిన జామున, చల్లగాలి వేళలోన చిటికెలతో తట్టి లేపి
లయను కూర్చి, లౌక్యం చెప్పే జానపదం నా తెలుగు పదం!!
అకారంతో, అచ్చుగా శ్రీకారమెత్తిన జాణ పదం
అమ్మకే ఆకారమౌ ఈ పదం నా జనని సమం!!

## చెప్పవే చిరుగాలీ - దేవకీ నందన్



గోపుర కలశాన్ని తాకిన గాలీ
గోవర్ధన గిరిధారిని స్పృశించినందుకు
ఆనందమా....
ఎద పయ్యెదపై ఎదురేగి రెపరెపలాడిన గాలీ
రాధ మనసులో మాధవుడున్నాడని గ్రహించినందుకు
ఆనందమా....
గోమాతల మెడలలో మువ్వలగంటలను



గలగలలాడించిన చిరుగాలీ
గోవుల గోపన్న వెన్న దొంగయని తెలిసినందుకు
ఆనందమా.....
కాళింది మడుగుపై వీచేగాలీ
కాళీయ మర్ధనుని తాకినందుకు
ఆనందమా.....
పిల్లన గ్రోవిలో మధురగానమైన గాలీ
శిఖిపింఛమౌళి గానామృతమైనందుకు
ఆనందమా...
శారదరాత్రులలో వీచే పిల్లగాలీ
గోపికా చోరుని రాసలీలలు వీక్షించినందుకు
ఆనందమా...
దేవదేవుని కంఠమాలను తాకిన గాలీ
పరిమళాలను పరిసరాలకందిస్తున్నందుకు
ఆనందమా....
చిన్నికృష్ణుని  చేతి స్పర్శకు తపించిన గాలీ
కరచాలనముతో కారుణ్యమూర్తి అభయముద్ర దొరికిందని
ఆనందమా...
పరమాత్ముని పాదాలనంటిన గాలీ
పరంధామునికి పాదాభివందనం చేసినందుకు
ఆనందమా...

## నీ రేయి నా దోయి - తమస్విని

చిట్టాలు, ఆవర్జాలు, ఇన్వెస్ట్‌మెంట్లు, ఇంటి ఖర్చులు
అప్పులు, ఆదాలు, ఆదాయ వ్యయాలు
లోనికి మోసుకురాకు
పడకంటి గుమ్మంలోనే వాటిని వేలాడదీసిరా!
దినమంతా నువ్వు గడిపే ఆ ప్రపంచాన్ని రాత్రి విశ్రాంతి తీసుకోనీ

పగలంతా నువు రాజువి!
నీ కార్యకలాపాలు విధి నిర్వహణలలో నువ్వు బిజీ
నేను నీ మంత్రిని
నీకు నచ్చినా లేకున్నా నీకు సలహాలిస్తా నీ అసహనాన్ని భరిస్తా
నీ ఆకలి చూస్తా నీ నీడలా చరిస్తా
పగలు రేయిల సంగమ సంధ్యలో వాటిని ఒక్కొక్కటి వదిలేయడానికి
సిద్ధపడు.. ప్రయత్నించు.. సఫలమౌ..
పడకటింటి గుమ్మంలోనే వాటిని వేలాడదీసి రా!
అనురక్తి అభివ్యక్త స్పందనలతో నా ప్రపంచంలో అడుగుపెట్టు
ఇక్కడ నేను రాణిని!
నా తలుపులు తపనలు ఆరబోసుకుంటాను
నా కోరికలు కాంక్షలు నీతో కలబోసుకుంటాను
నా కోసం నేను జీవిస్తాను.. దాన్ని నీతో పంచుకుంటాను
అల్లరి చేస్తాను నీ అల్లరిని వాంఛిస్తాను
పగలంతా నువ్వు దైహికంగా బ్రతకడానికి శ్రమించు
రాత్రంతా మానసికంగా జీవించు
నా జీవితం మొత్తం నీదే. నీ రాత్రులని మాత్రం నాకివ్వు!
నీకు తెలుసా?
ఆ సుదీర్ఘ పగళ్ళన్నీ ఈ హ్రస్వ రాత్రుల కోసమే నేను భరిస్తాను
మళ్ళీ తెల్లవారగానే
నీ బాధ్యతల చొక్కా నువ్వు తొడుక్కో
నా ఇల్లాలి పాత్రలోకి నేను ప్రవేశిస్తాను!!

## రసరేఖలు

-బచ్చోటి శ్రీధరరావు

ఇచటి పూబాట నడచి పోయితిమి మొన్న
వ్యక్తమే కాని యానంద మందు మునిగి
కొమ్మపై చివురులు మేయు కోయిలొకటి
మధుర గానమ్ముచే మన మదుల నింపె



ఆయమృతమయ గానరసాబ్ధిలోన
వేరు నీవు నేనను యూహ విస్మరించి
ఒక్క మనసుతో యుప్పొంగి యొప్పినాము
కరిగి యానంద నౌకలో తిరిగినాము

నేడు శీతలమౌ మావి నీడలోన
కూరుచుంటిని - తీయని గొంతు విప్పి
వలపు పాటలు పాడెను కలరవమ్ము
గుండెలో పూల కత్తులు గ్రుచ్చుకొనగ

గుండెలో భావమేదొ కొట్టుకొనును గాని
వీసమంతైన నయ్యది వెలికి రాదు
స్వాంతమున నిండినట్టి ప్రశాంతి యేమొ
తెలుసుకోలేని వింత యుద్వేగమేమొ?

## చందురుడు- నేను

- వి. ఆర్. విద్యార్థి



చందురుడు, నేను
నా చిన్న నాటి నుండీ
మంచి స్నేహితులం

మరీ ముఖ్యంగా అరవైతొమ్మిదిలో
'ఆర్మ్‌స్ట్రాంగ్' చందురుని హత్తుకున్నప్పుడు
చెవిలో ఏమి చెప్పాడో ఏమోగానీ
ఆరోజు నుండీ నాకు మరీ 'జిగిరీ' అయ్యాడు చందురుడు!
ఇపుడు బహుశా
మా అంతటి ప్రాణస్నేహితులు
ఈ లోకంలోనే లేరేమో!

రాత్రికాగానే మేమిద్దరమూ కలిసి
'మార్నింగ్ వాక్' కి వెళతాము

చంద్రుడు నిండుగా ముస్తాబైన రోజు
మా తూర్పు వాకిట నిలుచుని
నన్నురమ్మని పిలుస్తుంటాడు

ఇక మేమిద్దరమూ కలిసి
సముద్రపు ఒడ్డున నడుస్తూ
అలల పుస్తకాన్ని సమీక్షిస్తుంటాము

ఎడారి ఇసుకలో చేరి
'కాల'పు శిలాజాల్ని తవ్వుతున్నాము

ఆసరాకోసం
ఒకరి చెయ్యి ఒకరం పట్టుకుని
కొండశిఖరాన్ని పాకుతూ
సృష్టి 'అంతరా'ల్ని లెక్కిస్తునాము

తిరిగి తిరిగి పడమటి తోటలోన చేరి
ఆనందపు హద్దులనదుకుంటున్నాము
అపుడపుడు చందురుడు
తన 'డైరీ'ని నాకిచ్చి చదవమంటాడు
నేను రాసిన ప్రేమగీతాన్ని వినిపించి
తప్పులుంటే దిద్దమంటాను

ఎప్పుడైనా చంద్రుడికి
'మూడ్స్'బాగోలేనప్పుడు ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోతాడు
ఎవరితోనూ మాట్లాడకుండా
నేను నా గదిలోనే ఉండిపోతున్నాను

అదిసరేగానీ,
చంద్రుడు తను 'అమృతవేది'నని
ప్రత్యేకంగా చెప్పాలా?
నేను రుజాగ్రస్తుణ్ణవుతున్నానని
అతడికి మాత్రం తెలియదనా
అది మా ఇద్దరి మధ్య రహస్యము.

## బజ్జో..నాన్నా.. - లక్కోజు గోవిందరాజు





బజ్జో నాన్నా బజ్జో

నీకు నేనున్నా.. (బజ్జో నాన్నా..)

అమ్మ ఒడిలో ఆడుకుని

నిదురించమ్మా

ఈ హాయి ఎన్నటికి రాదమ్మా

అందుకే నిదురలోనూ

నవ్వవమ్మా..

నవ్వవమ్మా (బజ్జో నాన్నా)

బాబు.. బంగారు వంటి మనసు

నీకు వున్నది

ఆమనసు ఎన్నటికి

చెదరనీయకు

నీలోని దేవుడిని

తరిమి వేయకూ..

తరిమి వేయకు (బజ్జో నాన్నా)

## అన్నదాత - సంజి శ్రీరామ్




ఆకలెరగదు సృష్టి అసలీ కష్టజీవే ఉండు వరకు

ఆ కలి శపియించెనేమో కూడు లేదీ కర్షకునకు

పుడమి తల్లికి పుట్టలేదో? ప్రేమ నీపై చూపదో?

పడిన కష్టం పరులకే, పస్తు మాత్రం మిగిలెనో?

సన్నగిల్లి, సొమ్మసిల్లి నీ చెమటనే



చిందిస్తివో?
మండుటెండన మట్టి తడిపి మెతుకునే పుట్టిస్తివో?
నలుగురాకలిని తీర్చ నాగలిని నువ్ చేపడితివో?
విధి జాలమో, విపరీతమో అదే గుండెపై శూలమో?
పోని ఈ కలి గాలినీ, నీ సేద తీర్చే సంజ్ఞని!!
నేల తల్లి మొరలు నల్ల మబ్బును కదిలించునులే!
ఉరిమి, మెరిసి మేఘమాల ఊరట కురిపించునులే!!
ఆకసము మొదలీ అవని వరకా వాన వంతెన వేయులే!
ఝూరా ఝూరా సిరి హరిత సరితై చేరి ఇలను వరించులే!!
శుభములే చేకూరులే, సుఖఘడియలే సిద్ధించులే!
రైతే రారాజను నినాదం దిగ్దిగంతముల మ్రోగులే!!

## అందాలు

- ఝాన్సీ లక్ష్మి కొత్త



అలవోకగా మనసుకు హత్తుకునేదీ
ఆహ్లాదాన్ని పంచేదీ
మైమరిపించేదీ
ఎదలోయల్లో తారట్లాడేదీ
అదే అదే అందానికి ఆనవాలు



మనసులో మెదిలినా
భావంలో కదలినా
అపురూపమై నర్తించినా
మరో లోకాన్ని ఆవిష్కరించేదీ
అదే అదే అందానికి ఆనవాలు

చిరు కోపం

దరహాసం

తొలివలపు

మది కులుకు

అందాల అనుభూతులు

అరకు లోయ హరితాలో

అజంతా శిల్పాలో

విహంగయాన పంక్తులో

వియత్తలాన చుక్కలో

చిందిపడే అందాలకు ప్రతిరూపాలు

అలల మీది మిలమిలలు

చిగురాకుల గుసగుసలు

గడ్డి పోచల కిరీటాలు

కొమ్మలలో కిరణాల జాలు

నయనాలలో నాట్యమాడి

గుండెలలో గుభాళించి

చెరగని ముద్ర వేసి

చిరకాలం నిలిచిపోయే సుందర స్వప్నాలు

అందాల అనుభూతులు

ఆనందపు పరిదీప్తులు.

## నాన్న - తమస్విని

వృద్ధుడిగా నాన్న ఎలా ఉంటాడో

బట్టతలతో గాంధీ తాతలా బోసినవ్వులు చిందిస్తాడో

పండిన తలతో హుందాగా వృద్ధాప్యాన్ని ఎంజాయ్ చేసేవాడో

వార్ధక్యం శాపం కాదు, అందంగా మలచుకుంటే అదీ
ఆనందకరమైన అనుభవించదగిన విషయమే అనే నాన్న
ఆ అనుభవాన్ని అనుభవించకుండానే నడివయసులోనే
రాలిపోయాడు
మరో పదేళ్ళలో నాకంటే చిన్నవాడవుతాడు నా చిన్నారి నాన్న!
ఇరవై ఏళ్ళ నాడు పోయిన నాన్న రూపం
మనోఫలకంలో అస్పష్టంగా మారుతోంది
ఇంకొంత కాలానికి దేవుడిలా నాన్న కూడా
ఊహామాత్రంగానే
గోచరిస్తాడేమో అనుకుంటే మనసు మూగపోతోంది
తండ్రులు జీవించి ఉన్న నా వయసు వాళ్ళని చూస్తుంటే ఈర్ష్యగా అనిపిస్తోంది
తాతలు ఆడించే పిల్లల్ని చూస్తే నా పిల్లలపై జాలి కలుగుతుంది
అకాల మరణాలు లేని రామ రాజ్యంలో పుడితే బావుండేదనిపిస్తుంది
వచ్చే జనంలో నాన్నకి అమ్మగా పుట్టాలనిపిస్తోంది!!



## రసరేఖలు

-బచ్చోటి శ్రీధరరావు

మండిపోవుచు కాసిన యెండ వేడి
ఈ శరీరమ్మునుడుకులెత్తించుచుండె
పెల్లుబుకుచున్నదొడలెల్ల స్వేదజలము
అనలతప్తమైనటులుండె నక్షియుగము

పడమటి దెసనుండి వచ్చి సోకెడు గాలి
గాడుపై యెడదను క్రమ్ముచుండె
మనసిదేలనో కమలిన కమలమయ్యె
ఎడద విను చెలీ! ఘనీభవించె

వలదు! ఇపుడు నీ చూపు వెన్నెలల తున్క
ఒక్కటేనియు వచ్చి శైత్యోపచార
ములను చేయ తలచెనేని, మురియ వలెనొ
కలత పడవలెనొ సుబోధకమ్ము గాదు

తలలు దిమ్మెక్కు భయద నిదాఘమందు
ప్రియపరీభాషణమ్ము భరింపలేను
మలల వెన్కకు సూర్యుని మరలనిమ్ము
అరుణ సంధ్యాగ్నినైన మాటాడజూతు

పవడములు కెంపులెన్నొ నభమ్మునందు
వింత కాంతులు విరజల్లు వేళ యందు
రాగ వర్ణము నీమేన ప్రతిఫలింప
సుధల దేలుద మాకాశ పథమునందు

వంగూరి ఫౌండేషన్ కవితల పోటీలో బహుమతి పొందిన కవిత

# కవి

- నచకి



అసహాయతతో,

ఆకలితో,
ఇష్టంలేని జీవితాన్ని
ఈసడించుకుంటూనే,
ఉన్నన్ని ఏళ్ళూ
ఊడిగాలు చేస్తూ
ఎవరెన్ని మాటలంటున్నా
ఏమీ ఎదురాడకుండా,
ఐనా నిరాశంటే తెలియకుండా,
ఒక్కలాగానే రోజూ బ్రతికేసే
ఓటి మనసుల గాయాలకు
ఔషధాన్ని తయారు చెయ్యగలవా నువ్వు?
అంతులేని ఆలోచనలే కానీ
అంతకన్నా సాధించలేవులే!

కడగండ్లతో సమాజం
కళ్ళముందు పడి ఉంటే
కష్టాల కొలిమిలో మనిషి
కమిలి బూడిదౌతుంటే,

కన్నీళ్ళు ఆవిరై మనసు
కళ తప్పి బ్రతికుంటే...
కవీ!
కళ్ళు మూసుకుని
కనిపించని కవితా శిల్పం కోసం
కఠినమైన భావపాషాణాన్ని
కలం ఉలితో చెక్కుతున్నావా?!
కన్న బిడ్డల మీద కన్నా
కన్న భూమి మీది మమకారంతో
కదన రంగానికి కొడుకుల్ని పంపి
కడుపు తీపిని చంపుకునే తలితండ్రుల ప్రేమ
కదిలించదా నిన్ను?

కన్ను తెరవని పసిగుడ్డును
కసాయిల్లా చెత్తలో పారేసే
కన్నె తల్లుల తీరు
కలచి వేయదా నిన్ను?

కలత పడని రోజులు లేక,
కలలు లేని జీవితాలతో
కలకాలం బ్రతుకు వెళ్ళదీసే
కష్టజీవుల వ్యధకు
కఱగవా నువ్వు?!

కరుణ లేని నువ్వు
కనలేవు, వినలేవు
కటువైన నిజాల్ని!
కనుకనే "క-వి"వా?

కషాయంలాంటి విషయాన్ని
కమ్మని కవితలా వినిపించగలవు!

కమ్ముకున్న విషభాష్పవాయువులోనూ
కనీసం కళ్ళైన తడవని విరాగివి నువ్వు!
కడ తెలియని విషాద భువనాల్ని
కలలో విహరిస్తూ,
కథలా వివరిస్తావే కానీ
కరుణించని విశ్వరూపానివి!
కరెక్టే, నువ్వు క...వి-వే!

*వంగూరి ఫౌండేషన్ కవితల పోటీలో బహుమతి పొందిన కవిత*

## బాల్యం

డా. సురేంద్ర దారా

బాల్యం, దాని వెల అమూల్యం



అపూర్వం అవ్యక్తం
సుమధురం రసభరితం
మరువలేని నా బాలభారతం

చిన్ననోటికి పెద్ద మాటలూ
కొంటె తలపులూ కోతి చేష్టలూ
దాగుడు మూతలూ దొంగాటలూ
గుజ్జన గూళ్ళూ బువ్వలాటలూ

మరిడమ్మ గుళ్ళో ఇచ్చిన కోడీ
మండపేట కొట్లో ఉల్లిపకోడీ
పాండవుల మెట్టపై సూర్యుడి గుడీ
శ్రీరామ్మూర్తిగారింటి ప్రక్క లింకను బడీ

ఎలా మరువగలను
క్షణక్షణం ప్రతి క్షణం

జ్ఞాపకాల జావళీలు
గొంతు విప్పి పాడుతోంటే?

బడి కాగానే మొదలయ్యే ప్రైవేట్లూ
అల్లరి చేసినందుకు ఇంట్లో పెట్టే చీవాట్లూ
పోటీ మీద ఎక్కే మెట్ల మీది మెట్లూ
ప్రక్కిళ్ళలో ఎక్కిన మామిడి వేప సపోటా చెట్లూ

రోజులంటే అవీ
మళ్ళీ రమ్మంటే వస్తాయా
గుర్తుకొచ్చి గుండె తట్టి
గిలిగింతలు పెడతాయి కానీ
సినిమా వీధిలోని గుళ్ళో కనక దుర్గా
టౌను చివర ఉన్న సాహెబు దర్గా

ఆషాఢ మాసంలో తిరిగే మరిడమ్మ గరగా
తీర్థంలో కొన్న పదిపైసల బుడగా

కళ్ళల్లో మెదులుతాయి
చిరు సందడి చేస్తాయి
అనుభూతుల జడివానల నను ముద్దగ తడుపుతాయి

అమ్మ చేసిన బూడిద గుమ్మడి హల్వా
నాన్నగారు కుట్టించిన లాల్చీ సుర్వా
నాన్నమ్మ తినిపించిన గోరు ముద్దల బువ్వా
అన్నయ్య దీపావళికి వేయించిన తారాజువ్వా

ననుచుట్టే దడికట్టే
మధుర స్మృతుల గువ్వగూళ్ళు
అనునిత్యం పలుకరించు
తిరిగిరాని మైలురాళ్ళు

*వంగూరి ఫౌండేషన్ కవితల పోటీలో బహుమతి పొందిన కవిత*

# నడిపించేవాడు

- ఉదయకళ

లయబద్ధమైన పద్యాలలో
ఇప్పుడు కూడా గుళ్ళలో
మా  తాతగారి తాతగారు
తిరుగులేని బాణంలా
పెను తుఫాను గాలిలా
ఆ ధర్మ ప్రభువు
రథాన్ని ఎలా నడిపారని
పాడుతూ ఉంటారు

ఇరువై అయిదు వందల ఏళ్ళకు ముందు
మా తాతగారి నాన్నగారు
మిలమిల లాడే నదీ తరంగాలపై
ఆ అహింసా మూర్తి పాదాలతో
పావనమయిన పడవను నడిపి
అతడిని ఆవలి ఒడ్డుకు చేర్పించారట

నాలుగు వందల ఏళ్ళకు ముందు
మా తాతగారు పద్మముఖియైన ఆ మహారాణిని
సహగమనానికి
పల్లకిలో మోసుకుని పోయారట

వంద సంవత్సరాల ముందు
మా నాన్నగారు
మండే ఎండలో
చెప్పులు కూడా వేసుకోక
రిక్షాలో కూర్చున్న

ఎర్రని పెదాల తెల్లటి దొరసానిని
గబగబా లాక్కెళ్ళారు

నిన్న మొన్నటి వరకు
నేను
రైల్వే స్టేషన్ నుండి సత్రానికి
దేవుడి దర్శనానికి వెళ్ళే
పుణ్యాత్ములను
పాపత్ములను
నిష్పక్షపాతంగా
జట్కాలో ఎక్కించుకుని వెళ్ళేవాణ్ణి

ఈ రోజు
నా కొడుకు
రాష్ట్రపు రాజధాని నుండీ
దేశపు రాజధాని వరకు
ఆనందాన్ని పంచుతూ
దుఃఖాన్ని తగ్గిస్తూ
రాజధాని ఎక్స్‌ప్రెస్ నడుపుతున్నాడు

నా మనుమరాలేమో
రాబోయే కాలాన్ని తలుస్తూ
బంగారు కలలు కంటూ ఉంది
ఆమె కల
కాలానికీ అంతరాళానికీ
వంతెన కట్టి
గ్రహాలకు ఉపగ్రహాలకు
రోదసీయానం చేయాలని

అయితే ఊరి బయట బాబా
గడ్డం సవరిస్తూ చెబుతాడు

మనమంతా
ఈ భూమిపైన యాత్రికులం
వాడు ఒంటెలను పంపుతాడు
అంతులేని అంతంకాని
ఎడారిని దాటిస్తాడు
పానశాలకు నడిపిస్తాడు
పానీయాన్నిప్పిస్తాడు
సాకీచే
అమృతకలశంలో

## చెలి - శివ



చెలీ...
నీ పలుకుల తీయదనం వెదురులో ఊదితే - అది వేణువై మ్రోగింది...
నీ చూపుల చల్లదనం ఆ జాబిలికి చేరిస్తే - అది వెన్నెలై కురిసింది...
నీ అధరపు మధువంతా ఓ చోట కురిస్తే - అది వసంతమై విరిసింది..
నీ అలకల కులుకుల్ని కొయ్యిలో కూరిస్తే - అది కొండపల్లి బొమ్మై నిలిచింది...
నీ నడుముల ఒంపుల్ని ఓ నదికి అద్దితే - అది కృష్ణవేణిగా మారింది...
నీ మేని తళుకుల్ని ఆ దివికి దిద్దితే - అది మెరుపై భువి చేరింది...
నీ నడకల హొయలన్ని ఓ పక్షికి నేర్పితే - అది కలహంసై ఆడింది...
మరి నేను..
వెన్నెల్లో తడుస్తున్నా... వేణువులో మైమరుస్తున్నా...
కృష్ణను ఈదుతున్నా... మధువులు గ్రోలుతున్నా...
ఆనందపు మెరుపులలో... వసంతాల లోగిలిలో...
కలహంసలు వెంటరాగా... కొండపల్లి బొమ్మ చెయ్యిపట్టి సాగుతున్నా

## అనంత పయనం

- చింతా లక్ష్మీ సుజాత
విజయవాడ



నేను నడుస్తూనే ఉన్నాను
ఎన్నో పగళ్ళూ, ఎన్నో రాత్రుల సాక్షిగా
నేను నడుస్తూనే ఉన్నాను
ఎంత అలుపు వచ్చినా, ఆగి తట్టుకొని
నిబ్బరాన్ని, ఉత్సాహాన్ని అడుగులుగా మల్చుకుని
నేను నడుస్తూ ఉన్నాను
చెత్త కుండీలలోను, ముళ్ళపొదలలోను
నెత్తురోడుతున్న ఆడ శిశువులను చూస్తూ
శృతి చేయకుండానే తెగిపడ్డ తీగనై
పగిలిన స్వప్న శకలాలపై నడుస్తూనే ఉన్నాను
అబ్బాయికి ఉద్యోగం... అమ్మాయికి సంబంధమంటూ

రేయింబవలంత సహజంగా సాగే వివక్షతా దారుల్లో
పెళ్ళి చూపుల ప్రహసనాల్ని
వరకట్నాల కందకాల్ని దాటుకుంటూ
ఆచారాల కాష్టంలో కాలుతూనే
నిశ్శబ్ద నిశాంతం పొరలు పొరలుగా
ఆడదాని హృదయాన్ని కమ్మేస్తున్నా
రగిలేటి గుండె కాగడా వెలుతుర్లో
నేను నడుస్తూనే ఉన్నాను
ఆడబిడ్డకు జన్మనిచ్చిన మాతృమూర్తిని
అరసికనులో వెళ్ళగొట్టే జాత్యహంకార ధూర్తులు
శిథిలం చేస్తున్న మానవత్వ తునకల్ని ఏరుకుంటూ
తడి ఆరని ఆశలను... ఆయుధాలుగా మల్చుకుని
నడుస్తూనే ఉన్నాను

ఆరేళ్ళయినా... అరవైయ్యేళ్ళయినా సరే ఆడదైతే చాలన్న
కామాంధుల క్రీనీడల్ని సైతం సమూలంగా తుడిచేందుకు
అడుగడుగునా అగ్నికీలనై నడుస్తూనే ఉన్నాను
పితా రక్షతి కౌమారే.. భర్తా రక్షతి యౌవనే
రక్షతి వార్ధక్యే పుత్రా.. నస్త్రీ స్వాతంత్ర్య మర్హతీ
అన్న మను ధర్మాలు చితులు పేరుస్తుంటే ఉత్తుంగ ప్రళయాన్ని నేనై
నడుస్తూనే ఉన్నాను
మౌనమూర్తుల్ని కదిలిరమ్మని
చుట్టూ కట్టేసిన నిర్వేదపు గోడల్ని ఛేదించి
మహిళామణుల్ని నాతో కలిసి రమ్మని పిలుపునిస్తున్నా...
కష్టం వచ్చిందని..
కిరోసిన్ డబ్బానో... ఉరితాటినో ఆశ్రయమిస్తామా?
పీడకల వచ్చిందని బెదిరి నిదురనే కాదనగలమా?
బతుకు బండిలో ఓ చక్రాన్ని ఊడదీస్తే
నీకు నడకెక్కడ అని రెండో చక్రాన్ని నిలదీద్దాం
ఈ జీవితం మనది.. స్వాభిమానమే తోడుగా సాగి
'స్త్రీ'కు సరైన అర్థాన్ని చూపి
స్వేచ్ఛా గాలుల్ని శ్వాసిద్దాం...

## వెన్నెలాటలు

చొక్కాకుల వెంకట ప్రసాద్
కెనడా



వెన్నెల సఖియని
వన్నెలను వెన్నెలన్ బరచి
నువు జలక్రీడలాడు వేళ
సిగ్గుతో చుక్కలన్నియు
యే దిశల దాగెనో చెలి

మిగిలె నొక్క నెలజేడు మాత్రమాకసమున

నింగిన వడివడిగ సాగు
దూది పింజల బోలు వెండిమబ్బులు
మురువెమగు నీ ఆటలను జూడయాగి
మురిసి ఆనందముగ మరల పయనమైనాయి

హృదయమ్ము ఆనందసాగరముల తేలియాడు చుండ
నిను వర్ణింప పదములు వెతుకుతూ కొలను ఒడ్డున నేను

మిగిలిన ప్రపంచము మొత్తము నిశ్శబ్ధమాపైన
నిమిత్తమేల నాకు ప్రపంచముతోడ
నిండుగ నువు నాదు డెందంబునుండ

ఆటలాడుము చెలి
వెల్ల కలువల తోడ
ఉదయకాంతులు తాకి
కమలములు విరియుదాక

## రసరేఖలు

-బచ్చోటి శ్రీధరరావు



ప్రణయినీ! నా పయిన యనురాగమొలికి
పసిడి పల్కులు రెండైన పలుక వలదు
ప్రేమ మీరగా ధవళ చంద్రికల వోలె
లేత చిరునవ్వు సోన చిల్కింప వలదు

వసుధలోనున్న యనురాగ రసమునెల్ల

చూపులను నించి నను నీవు చూడవలదు
ముగ్ధ మోహన  సౌందర్య మూర్తి వగుచు
చెలియ! నాప్రక్క నెన్నడు నిలువ వలదు

చలువ వెన్నెల తలపించు చల్లనైన
మృదుల హస్తము వలదు నా నుదుటిపైన
కోయిలల తలపించు నీ గొంతుతోడ
వేయి రాగాల నాపేరు పిలువవలదు


ఒక్కసారైన నీ భాగ్య మొసగితేని
ప్రవిమలానందముననెద పరుగులిడును
ఎగయును మనోవిహంగమ్ము, హృదయమందు
నిండు గర్వమ్ము, కన్నులు నెత్తికెక్కు

## అంతర్ముఖం

- పి.వాణి
హైదరాబాదు



మనిషి మనిషిలోనూ ఎన్నో భావాలు
ప్రతి భావానికి ఒక్కో రూపం
ఒక్కో రూపానికి ఒక్కో ముఖం
అన్ని ముఖాలు రంగులద్దుకుని నిలుచుంటాయి
సమాజంలో పవిత్రంగా
అందరిలో విశిష్టంగా కనపడుతూ
ఏకాంతంలో ఒక్కో ముఖం మాట్లాడుతుంది
అన్ని తెలుసున్న ముఖాలు,
చిరునవ్వు ముఖాలు మాయమవుతాయి
ఎక్కడో మూలన అమాయకంగా నక్కి
చివ్వున లేస్తుందొకటి
వికృత రూపం దాలుస్తుంది
నాలుగు గోడల మధ్య తన
కర్కశత్వాన్ని చాటుతుంది
ఒకటి నిస్సహాయమై నిలబడి
అశ్రుధారలు నేల రాలుస్తుంది
చెంపలు కమిలి, శరీరం గజగజ వణుకుతుంది
ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటుంది
తలలో వేలవేల అగ్నిపర్వతాలు బ్రద్దలవుతాయి



అది చూసి ఆనందంగా నవ్వుతుంది వికృతరూపం
విలయతాండవం చేస్తుంది
రొమ్ము విరిచి నిలుస్తుంది
మీసం మెలేస్తుంది అప్పటికి...
అహంకారం శాంతిస్తుంది
మళ్ళీ ఎక్కడో ఒదిగిపోతుంది
చిరునవ్వుతో చూస్తుంది ఏమీ ఎరగనట్టు
అమాయకంగా తిరుగుతుంది ఏమీ తెలియనట్టు
ఇలా...........
కళ్ళ ముందు ఎన్ని ముఖాలో.....

## ఎదురుచూపులు

- వింజమూరి రాగసుధ
యు.కె.



నీకై వేచే కన్నియ కన్నులు
గురుతుకు తెచ్చెను వాడిన విరులను
కళ కోల్పోయిన  నగుమోమే
జ్ఞప్తికి తెచ్చె మేఘావృతాంబరమును
మురళి చిరు అధరాలను అంటను లేదు
యే స్వర రాగసుధ వీనుల అందను లేదు
నిను వలచిన  మనఃమందిరమే శూన్యమాయెను
దూరమైన నీజ్ఞాపకాల మధనంలో
వెలికి వచ్చె నీ వెచ్చని తలపులు
వెంటతెచ్చె రెండశ్రుకణములు
ఇకనైననూ ఇటు రాలేవా ప్రియా?
ఈ నిర్జనావనిలో వసంతవీణను పలికించి నా మదినలరించలేవా?

## నువ్వూ - నేనూ

స్వాతి శ్రీపాద
హైదరాబాదు





తవ్వే కొద్దీ ఊరే జల
మనసు పలవరించే జ్ఞాపకాల తేనెఊట
వందల జీవితాలు వెనక్కు పరుగెత్తినట్టు
మనసు గదిలో గతం మరు మ్రోత
ఉదయిస్తూనే గుభాళించే పారిజాతాల పానుపుపై
తొలివెలుగు కిరణాలు తనివిదీరా మేను మరచి
పరవశించిన క్షణాలు పున్నాగలుగా మలచుకు
పరిమళాలు పరచుకున్న అనుభవాల నీడ
ఓపూపొదరిల్లై సేదదీర్చే భావన
చూపులదారంట సాగి హృదయం వాకిలి దాటి
మెదడు లోలోపలి పొరల్లో నిక్షిప్తమైన ఉనికి
అలలు అలలుగా సాగి సాగి మస్తిష్కపు తెరల మధ్య
సుమధుర రాగమాలికగా కనిపించని తీగల మధ్య ఒదిగి
పోయి
విశాల విశ్వం ఏకాంతాల పాలపుంతల మధ్య
విహ్వలించె కన్నీటి రాజకుమారి
చెక్కిలి మీటి పలకరిస్తుందో తొలకరి స్వప్నం
నీలిమేఘాలూ, పారిజాతాలూ, ప్రేమగీతాలూ
రాయభారాలు నడిపిన పాటల విరిజల్లులూ
ఇంత మధురస్మృతులై వెంట నీడలవుతాయని
అస్తిత్వానికీ అమరత్వానికీ వారధులుగా
రూపుమార్చుకుంటాయని
కళ్ళు తెరిచో- ఒళ్ళు మరచో
కలగన్నానా ఎప్పుడైనా ...........
కలతలూ కన్నీళ్ళూ గరళంలా మింగేసి

పెదవులపై చిర్నవ్వుల దీపాలు
నీ కళ్ళలో దివ్వెలుగా వెలిగినపుడు
గుండెల్లో మహాభారత సంగ్రామాన్ని నిశ్శబ్దీకరించి
స్పర్శలో ప్రేమ సంద్రాల్ను ఉప్పొంగించి
చూపులతో సేదదీర్చే నీ పాట పల్లవులు
అనుక్షణం నిశ్శబ్దంగా ప్రవహించేవేళ
ఎల్లల్ను కూడా మింగేసిన శూన్యం
ఈ ఒడ్డున ఏకాకిగా నా ఉనికి
ఈతకందని జీవితానికావల
ఎదురుచూస్తూ నీ మనికి.

## రసరేఖలు

-బచ్చోటి శ్రీధరరావు



ఈ మహాప్రేమపాత్ర నాకిచ్చి ఇందు
క్షమ శీధు రసాల నా గళము నింపి
నేను నీకొరకున్మత్తుడైన తరిని
వెడలి పోయెదవేల నన్విడచి యిచట

బహుళ కంటకమయమైన పథమునందు
ఆంధ్యమే రాజ్యమేలు చిట్టడవి యందు
ముందు వెనుక తెలియని సముద్రమందు
ఒంటరిని చేసి పోయితివోపలేను




పూలు రాలి పోయి గులాబి పొలతి యొకటి
పదను ముండ్లతో నను తాకి పరిహసించె
కోమల గళమ్ము సవరించు కోకిలమ్మ
గొంతును నులిమి వైచిరి క్రూరులెవరొ

ఏను నీకొరకే జనియించి యుంటి
ఏను నీ ప్రేమ కొరకె జీవించుచుంటి
నిన్ను గూర్చియే నే మరణింతు ముందు
తిరిగి జనియింతు నీకై యదృష్టమున్న

## ఆశాజీవనం

-మోహన్ చైతన్య
బోస్టన్



కురిసే
ప్రతివాన చినుకూ
ఓ ఆణిముత్యం కాదు!
వెలిగే
ప్రతి కాంతి కణం
ఓ మృణ్మయ దీపం కాదు!
విలపించకు నేస్తం,
ఆకాశం అరుదుగా ఏడ్చే కన్నీటితో
సూర్యుడు వేసేది
ఒక్క హరివిల్లయినా,
కోటి గుండెల్ని స్పందిస్తుంది!

## అడుగు

- బాషా
దక్షిణ కొరియా

అడగవయ్య అడుగు, నీ ముందు తరాన్నడుగు,
మీ పెద్దలు మీకిచ్చిన అందమైన ప్రకృతిని,
మరి మాకు చేర్చలేదేమని దీనంగా అడుగు.



అడగవయ్యా అడుగు, ఆ భూస్వామిని అడుగు,
నారుపోసి, నీరుపెట్టి, నేను పెంచే పంటను,
నాకు దక్కనివ్వవేమంటూ ధైర్యంగా అడుగు.



అడగవయ్యా అడుగు, నీ యజమానిని అడుగు,
రెక్కలు ముక్కలు చేసినా, నీ సొమ్ము పెరుగుటే కానీ,
నా డొక్క నిండదేమంటూ లౌక్యంగా అడుగు.

అడగవయ్యా అడుగు, ఆ మాష్టారిని అడుగు,
చదువుకుందామని వస్తే, చదువు కొనుక్కోమని,
సరస్వతిని లక్ష్మికి దాసోహం చేసావేమని పదేపదే అడుగు.

అడగవయ్యా అడుగు, మన సినీ జనాన్నడుగు.
బూతు, ఫైటు, హింస తప్ప, చిత్రంలో చూపేందుకు అల్లిబిల్లి కథలు,
అందమైన కథలు, ఆలోచన తెచ్చే కథలే లేవా అని, అభిమానంగానే అడుగు.

అడగవయ్యా అడుగు, నీ అంతరాత్మ నడుగు.
చెప్పేటి మాటలకి, చేసేటి పనులకి
ఎన్ని మైళ్ళ దూరమని ఎగతాళి చేసి అడుగు

అడుగు, అడుగు అడుగు, అందరినీ అడుగు.
అడగందే అమ్మైనా బువ్వైనా పెట్టదు, అందుకనే అడుగు,
అడిగి, అడిగి సమాజాన్ని కొంచమైనా కడుగు.


## పల్లె తల్లి గుండెకోత

- చొక్కాకుల వెంకట ప్రసాద్
కెనడా



పట్నపు బాబులు గొట్టపు పేంటు బాబులు
సూటు బూటులతో తళతళా మెరిసే కార్లలో వచ్చారు
సెంటు కింతని నన్ను వెలకట్టి కొన్నారు
ఫ్లాట్లు వేయాలని, సిమెంటు పోసి కాంక్రీటు వనాలు కట్టాలని

గుబురు గుబురు ముంత మామిడి తోపు
పచ్చ పచ్చని నిమ్మ నారింజ తోట
బుల్డోజర్ల బడి నేలకొరిగాయి
కీకిలం రాచిలుక పక్షుల కిలకిలలు
ఏ అడవికో వలసెల్లిపోయాయి



టిప్పర్లు, లారీలు రణగొణధ్వనుల నడుమ
పుడమి తల్లి కునుకు చెదిరింది
ఫోనులు, సెల్లులు ఊళ్ళ మధ్య దూరాన్ని తగ్గించి
మనుష్యుల నడుమ దూరాన్ని పెంచాయి
ఐపాడ్లు, టీవీలు కుటుంబాల్ని పట్టి
తమ తమ లోకాల బందీల్ని చేసాయి

ఓరన్న, ఓలక్క, ఓలమ్మ
అన్న ఆప్యాయమైన పిలుపుల్ని
టీవీల గోలలో, ధనలక్ష్మి దేవులాటలో మాయమైపోయాయి
నిండు పున్నమి రాత్రులలో రాములోరి గుడికాడ
కాలుగుంటాట, చెడుగుడు పోటీలు

అర్ధరాత్రి సినిమాల చేతిలో చిత్తుగా ఓడాయి
అన్నదమ్ముల మధ్య అక్కచెల్లెళ్ళ నడుమ
ఇన్ని రణగొణధ్వనుల మధ్యనా
ఏదో తెలీని నిశ్శబ్దం రాజ్యమేలింది

రాజులెప్పుడో ఇచ్చిన రాములోరి మాన్యం
పర్వతంలాంటి కాంట్రాక్టరు ఇనుపకాళ్ళ వత్తిళ్ళకు
కరిగి మాయమైపోయింది
నైవేద్యం దిక్కులేని రాములోరిని చూడలేక
పూజారి పిల్ల పాపలతో సహా
పట్నానికి పయనమైపోయాడు

పట్టు పరికిణీలు, ఖద్దరు పంచెలు
జీను ఫ్యాంటులకు దారిచ్చి తొలిగాయి
పెసరట్లు, ఇడ్లీల పదిలమౌ స్థానాల్ని
పిజ్జాలు, బర్గర్లు ఆక్రమించేసాయి

మారుతున్న కాలానికి సాక్షిగా
మౌనంగా నిలించిది
గోస్తనీ నది ఒడ్డున ఉన్న
కొండ మీది పద్మనాభుని గుడి

## తోడు-జాడ

- వింజమూరి రాగసుధ

యు.కె.



వాన కురిసి వెలసి ప్రకృతి నిర్మలంగా ఉన్న వేళ అది
తనలో దాగి ఉన్న బాధని కరిగించి కన్నీరుగా మార్చి
వసుధ ఒడిలో వదిలి భారం దింపుకుంటూ సొమ్మసిల్లిన అంబరాన్ని
పైరగాలులతో పుడమి ఓదారుస్తున్న వేళ అది



ఆకు మీద ఓ నీటి ముత్యం వయ్యారంగా నిలకడ లేకుండా
కొంచెం కొంచెంగా జారుతూ కొసకి చేరి
ఈ నా ప్రయాణం నిను చేరటానికే సుమా అన్నట్టు
ఆకునుండీ విడవడి క్రింద కోనేరులో పడ్డప్పుడు
చిన్న చిన్న జలచరాలు కలవరంగా కదిలినప్పుడు
నిశ్చలంగా ఉన్న నీటిపై
ఒకటి ఒకటి ఒక్కటిగా తరంగాలు
ఉలికిపాటుతో చెలరేగిన వేళ అది
స్తబ్దంగా ఉన్న నా మదిని నీ స్నేహ బాంధవ్యంతో
అల్లకల్లోలం చేసిన వేళ అది
ఆరాటపడుతూ ఒంటరిగా నే సాగుతున్నప్పుడు
తోడై నీవు దొరికినవేళ అది

## నానీలు

- జి.స.నా.రా
హైదరాబాదు

పాతసినిమా
చూస్తున్నారా!
ఇంక మరి
పరమాన్నం ఎందుకు?

ఆసరా కన్పిస్తే
అల్లుకుంటుంది!
ఆగ్రహం వినిపిస్తే
ఝల్లు మంటుంది:

రాజకీయ బెల్లం చుట్టూ
రాకాసి చీమలు!
కదిలిస్తే
చంపేస్తారు!

చీమ వెనుక చీమ
అది క్రమ శిక్షణ!
మనమో...?
ఎవరికివారే!

అమ్మ ఒడి,
దేవుని గుడి,
పచ్చని నారుమడి,
ప్రశాంత నిలయాలే!

అతని జీవితం
క్షీరసాగరమథనం!
జరిగింది
హాలాహలే!

ఒకరిపై ఒకరు
బురద చల్లుకుంటే!
వెలుగు చూసేది...
కుంభకోణాలే!

నేతలంతా
గొప్పింటి బిడ్డలే
చేతలు మాత్రం..
పెడసరి బుద్ధులే!

## రసరేఖలు

- బచ్చోటి శ్రీధర్

తెరలు తెరలును పొరలును పొరలు గాగ
ఆవరించెను మేఘములాకసమున
వర్షధారలు దిగి వచ్చి బయలు నింపి
చెట్టుచేమల పులకింపజేసి వెడలె

చివురుటాకుల అంచుల చెలులకెల్ల
వీడుకోలును చెప్పి తా వెడలె వాన
తోడు విడవలేని వర్షబిందువులు కొన్ని
ఆకు చివరలు బట్టి వ్రేలాడుచుండె

వర్షమెల్లను వెలిసెడి వరకు వేచి
తడిసి ఇంకిన నేలపై యడుగులిడుచు
నడచి వత్తువు నా ఇంటి నడవకనుచు
వీధి దగ్గరనే నిలిచి వేచియుంటి

ఎంతసేపైన గాని నీ విటకురావు
ఎదురు తెన్నులు చూసి నా ఎడద కృంగి
బాధ చెందుచునింటి లోపలికి రాగ
ఎదురుగా నిల్చినావు నా ఇంటిలోనె

ఎదురు చూసిన యానంద మింత వడిగ
గుండెలోజొచ్చి యొడలెల్ల నిండిపోవ
రెక్క విప్పిన ముదము భరింపలేక
వెడలిపోతి బయటకు నిర్విణ్ణుడగుచు

## బలి పశువు

- ఆకుండి విజయ కుమార్
హైదరాబాద్



సింథటిక్ చీర సింగారం నలిగిపోతుందేమో?
నన్నెత్తుకు ముద్దాడమని సతాయించనులే రోజా!



ఒకప్పటి మబ్బుల చాటు చందమామ
ఆకాశ హర్మ్యాల పద్మ వ్యూహంలో చిక్కుకుని
మునుగురుగా మారాడు...!
ఇక సమస్యేముంది?

అయినా బువ్వ తిననని మారాం చేస్తే చందమామని
చూపనవసరం లేదు కానీ...
గగన తలంలోకి టేకాఫ్ అయ్యే ఏరోప్లేనుని
నాలుగుసార్లు పడి లేచి నిల్చున్న ఈ ఫ్లై ఓవర్ పై నుంచి
చూపిస్తే చాలు సర్దుకుపోతాను...!

నీకు నాన్నకు మధ్య అడ్డుగోడగా కూర్చోనులే కారులో
నా కోసమే కేటాయించిన డిక్కీలో డొక్కు సీట్లో పడేస్తే
అతుక్కుపోతాను...!

కానీ ఒకే ఒక్క కోరిక!!!
నన్ను అమ్మా అనినీ ప్లీజ్ మమ్మీ అని మాత్రం అనమనకు...

నేను ఎవరనా..?
గర్భస్థ శిశువునై నారాయణమంత్రం అలవరచుకున్న
ప్రహ్లాదుడిని కాదు కానీ...

లోనుంచే ఈ క్రైమ్ కల్చర్‌కి
భయపడి భూమ్మీద పడడానికి బిక్క చచ్చిపోతున్న కార్పోరేట్ శిశువుని..!
రాబోయే తరానికి కాబోయే బలిపశువుని
నేనే రేపు ఓ క్రిమినల్ అయితే ఆ పాపం ఎవ్వరిది.!

## చిత్రం! - అ. సూర్యం



అప్పగింతల వేళ, సాగనంపే వేళ
అయ్యోరి చేపట్టి ఇంటి కెళ్ళే యేల,
ఊరొదిలి, వీధొదిలి, ఉన్నవాళ్ళని వదిలి,
ఇల్లొదిలి, నేలొదిలి సాము చేసిన పిల్ల,
ఏమంత చిత్రమో, ఈ విధి చిచిత్రమో,
నీలాల నీ కనుల, నే కంటి నిలాలు!

కోనేటి నీటిలో, అలల మాటున దాగి
అర తడిసి మెరిసినా కంలాల నేచూస్తి,
బాసికపు మెరుపులో, గోరింట ఎరుపులో,
ఎర్రబారిన కనుల కమలాలనే చూస్తి,
ఏమంత చిత్రమో, ఈ విధి విచిత్రమో,

ఈ చెంత, కమలాల నిండెనే నీరు!
చక్కిలాలాదిగా, చుక్క తో ఉన్నట్టి
గిల్లి కజ్జాల కే లెక్కలేదు
ఎక్కాల, రొక్కాల, అక్క చే తిన్నట్టి
చెంప దెబ్బలకి, ఏ లెక్క లేదు.
ఈనాటి, వెంజేత అక్క నిమిరిన బుగ్గ,
ఏమంత చిత్రమో, ఈ విధి విచిత్రమో
మా తమ్ము చేసెనే బుక్కి బుక్కీ!

## అమ్మ చేతి గాజులు

- పెరుగు రామకృష్ణ
నెల్లూరు



పాన్‌బ్రోకర్ నుండి
పంచ నక్షత్రాలనక్షత్రాల గోల్డ్‌షాప్‌గా మారిన
ఆ సేటు కొట్టు ముందునుండి ఎప్పుడెళ్ళినా
అమ్మ గుర్తొస్తుంది..
అమ్మ చేతి గాజులు గుర్తొస్తాయి..
అమ్మ సంతోషాన్నీ
అమ్మ దుఃఖాన్నీ
అమ్మ అలకల్ని
అమ్మ ఆవేదనలన్నీ
ఆ గాజు గలగలకే తెలిసేవి..
అమ్మ మమతల్నీ
అమ్మ ఆప్యాయతనీ
అమ్మ అనురాగాన్నీ
ఆ గాజుల కళకళలే చాటేవి..
అమ్మ చేతికున్నంతకాలం
ఆ గాజులు బంగారానికి ఐదోతనం తెచ్చాయి



ఆ గాజులు నవ్వుల మువ్వల్ని శబ్దీకరించి శ్రుతి చేసాయి
పెద్ద పిల్ల రజస్వలైనప్పుడు
మనవడి అపెండిసైటిస్ ఆపరేషన్‌కు
నాన్నను తాకట్టు పెడతావా అంటూ నిరసన ధ్వనించిన అమ్మ...
కన్నకొడుక్కి విషజ్వరమొచ్చినప్పుడు మాత్రం
కరిగిపోయి గాజుల్ని గడ్డిపరకల్లా వలిచిచ్చేసింది అమ్మ
బొడ్డు పేగు బంధానికి బందలైన ఆ గాజులు
అమ్మ బ్రతికుండగా అన్నయ్య విడిపించుకోలేదు...
అమ్మే పోయాక... అమ్మ చేతిగాజులు అమ్మను తెచ్చివ్వగలవా...?
అనుకున్నాడో ఏమో...? అన్నయ్య గాజుల గోడు
మర్చేపోయాడు అమ్మతోడు

## రసరేఖలు

- బచ్చోటి శ్రీధర్

ఊరు ఊరెల్ల వెదకి పై యూర్లు వెదకి
అన్ని  విధముల నాకనువైనదాని
తెచ్చి కోడలి జేయ చింతించునట్టి
తల్లిదండ్రుల ముచ్చట తలపనైతి

తల్లిదండ్రుల గూర్చు బంధమ్ములందు
ప్రేమయన్నది పొందగాలేమటంచు
మనసు చూపిన త్రోవకు మరలినాను
నిన్ను మాత్రమే మదిలోన నిలిపినాను

ఎన్నుకొనలేదు నా తండ్రినెన్నడైన
ఎన్నుకొనలేదు నా తల్లి నెన్నడైన
దైవమే గూర్చె వారి బంధమ్ము నాకు
ఎడద కరవయ్యెనే వారి యెడల నాకు?

అట్టి శాశ్వతమైన ప్రేమామృతమ్ము
పెద్దలు కలిసి చేయించు పెండ్లియందు
మనలకొనగూడునన్న నమ్మకము లేక
వెడలి పోయితి వారల ప్రేమ వదలి

చేరితిని దోసిలొగ్గి నే చెంత నేడు
ప్రేమ పూవులనిందు పుష్పింప మనుచు
పరమ రాగామృతాబ్ధిపై తరలి రమ్ము
వమ్ముచేయకు నీమీది నమ్మకమ్ము



## స్మృతి పరిమళం

తమస్విని
హైదరాబాద్





'బాగున్నావా?' భుజం మీద చెయ్యి తల తిప్పి చూస్తే ఎదురుగా మరియం!
చిన్ననాటి నా నేస్తం నలభై తర్వాత! పరికిణీల నాటి మరియం నేత చీరలో భారీగా
కళ్ళజోడు లోంచి మెరిసే కళ్ళతో, స్నేహానురాగాలు మిళితమైన నులివెచ్చని స్పర్శతో
నువ్వేం మారలేదబ్బా అచ్చం అలానే వున్నావ్ ఆప్యాయతతో కూడిన అతిశయోక్తి
రా ఇలా కూర్చుందాం - బస్టాండ్‌లో బెంచీ మీద మొదలైంది మా మాటల ప్రవాహం
ఒకరి తర్వాత ఒకరు, ఒకరు ఆపకుండానే ఒకరు
ఆనకట్టలేని జ్ఞాపకాల వరద చిన్ననాటి విశేషాల జలపాతం
మాతో చదివిన అబ్బాయిల గురించి మాట్లాడేటప్పుడు మేం యౌవనంలోకి ప్రవేశించాం
వారి మూగ ప్రేమలు, ఆరాధనలు ఒకింత గర్వంతో ఆనందంగా చెప్పుకున్నాం
అప్పుడు మాకు భర్తలు, పిల్లలు ఎవరూ జ్ఞప్తిలో లేరు!
మాతో చదివిన అమ్మాయిల గురించి మాట్లాడేప్పుడు మేం పదహారేళ్ళ వయస్సులోకి వెళ్ళాం,
వాళ్ళ అందాల గురించి పొడుగు జడల గురించి ఈర్ష్య మెరమెరలాడుతుండగా చెప్పుకున్నాం
మధ్యలో నిష్క్రమించిన వారి కోసం వారు అప్పుడే పోయినట్లు ఏడ్చాం
ప్రేమించుకున్నవారు పెళ్ళిచేసుకున్నందుకు అభినందనగా సంతోషించాం
నిన్న మొన్న జరిగినవే గుర్తురాని ఈ వయసులో
నలభై ఏళ్ళ జ్ఞాపకాలు పచ్చిగా, పచ్చగా అప్పుడే జరిగినంత తాజాగా....

ఆ బస్టాప్‌లో బెంచీ మీద కూర్చున్న మా నడి వయసు ప్రౌఢలకి
సమయమే తెలియలేదు - జ్ఞాపకాలకి ఆనకట్టలేదు.
'అయ్యో! నా బస్సు వచ్చింది ఉంటానేం'
మెరిసే కళ్ళు కన్నీటితో మరింత తళతళలాడుతుండగా
బస్సెక్కి నెమ్మదిగా కనుమరుగైంది నా చిన్న నాటి నేస్తం మరియం
తనెక్కడుంటుందో చెప్పలేదు - నేనెక్కడుంటానో అడగనే లేదు
ఓ మధురమైన స్నేహ శలాకలావచ్చిపోయిన మరియం
నిష్క్రమించి చాలా సేపైనా, ఆ స్మృతి పరిమళం సుతారంగా నన్నంటుకునే ఉంది!!


## ఇంటిని వెదుక్కుంటూ...

రామా చంద్రమౌళి
వరంగల్



నీతో మనసు విప్పి మాట్లాడాలని కదా నేననుకుంటాను
పిలుపు ఒకటి గొంతులో తన్నుకుంటూంటుంది
మాటలు పెకలవు
ఎండకాలం... గదిలో ఉక్కపోతవలె మనసు
లేత రావిచెట్టు ఆకు జ్ఞాపకమొస్తుంది..రెపరెపా
పడవపై తెరచాప ఎత్తుతూ గుంజకు తాడును కడుతున్నపుడు
అన్నీ చిరుగులే..కుట్లు కుట్లు
సూదితో గుచ్చుకుపోకుండా ఒక కుట్టు వేయగలమా
చటుక్కున ఉబికే రక్తబిందువు ఎంత ఆశ్చర్యం
గాయం కదా అది.. ఎప్పుడూ ఒక ఓటమిని శ్వాసిస్తూంటుంది
ఔనూ గెలుపుకూ ఓటమికి ఏమిటి తేడా
ఒకటి యాభై ఒకటి
మరొకటి నలభై తొమ్మిది. నడుమ సన్నని గీత
ఎక్కడనుండో చటుక్కున ఎగిరొస్తుంది ఓ పిచ్చుక

పిడికెడంత
ఒక కిచకిచ...ఒక కితకిత...పిడికెడు గింజలకోసం
ఒక మాయామేయ విషయ ద్వంద్వ ప్రదర్శన
ఇవ్వాళ..ఇప్పుడెగిరిపోతున్న పిచ్చుక
రేపు మళ్ళీ తప్పక వస్తుందా?
అమీబావలె విచ్చుకుంటూ, విస్తరిస్తూ... విజృంభిస్తూ
పరివ్యాప్తమౌతూ
ఏక కణం, ద్వికణం... సంయోగ విచ్ఛిన్నతలతో ఓ జైగోట్
అణుకణ శోధనలో... హృదయ మ్యాపింగ్
ఎక్కడా రవ్వంతకూడా 'వాత్సల్యం' కనిపించదు
మైక్రోస్కోప్‌లో
నాన్‌విజిబుల్ - ఇన్‌విజిబుల్...ఒక అనుశీలన
ఎక్కడో రైలింజన్ కూస్తూంటుంది కొండల్లోనుండి
ఇక ప్రయాణం ప్రారంభం కావాలి



ఒక ఆకాశం...ఇద్దరు సూర్యుళ్ళు
ఒక చంద్రుడు..రెండు ఆకాశాలు

ఎక్కడినుండో ఒక పెద్ద బాడ్వె ఎత్తబడుతుంది
గుండె పొచ్చెలు పొచ్చెలుగా చెక్కబడ్తూ
ఆకారం రావాలంటే వస్తువు కోయబడాలి గదా
మనిషి చెక్కబడ్తూ చక్కబడ్తూ
ఒక అస్తమయవేళ ఇంటిని వెదుక్కుంటూ వస్తే
అయ్యో ఇల్లంతా ఖాళీ.. చేతులు రక్తసిక్తం
ఉండవలసిన వాళ్ళెవరూ లేరు

## నేను కాని నేను

కోడూరు శ్రీవేంకటేశ్వర స్వామి
హైదరాబాద్

ఎందుకులేరో?...వెదకాలి...



నేనొక ఆజన్మ అనామకుడ్ని
నేనొక అనావృష్ట్య మేఘాన్ని
నేనొక నిర్జీవ నదీనదాన్ని
నేనొక అనుభూతి లేని చేతనాన్ని
నేనొక అర్ధరాత్రి సూర్యుడ్ని
నేనొక అమావాస్య చంద్రుడ్ని
నేనొక అతారకాగ్రస్త ఆకశాన్ని
నేనొక ప్రేమ రహిత హృదయాన్ని
నన్ను నన్నుగ చూడనిస్తే
నన్ను నన్నుగ మాట్లాడనిస్తే
నన్ను నన్నుగ చింతించనిస్తే
నిజంగా నేను నేను కాగల్ను
నా జన్మకు నామకరణం చేయుగలను
నేనొక సువృష్ట్య మేఘాన్ని కాగల్ను
నేనొక సజీవ నదీనదాన్ని కాగల్ను
నేనొక అనుభూతియుక్త చైతన్యాన్ని కాగల్ను
నేనొక ప్రాగ్దిశాంశుమణిని కాగల్ను
నేనొక విరిశిన పున్నమిని కాగల్ను
నేనొక తారాధర అంబరాన్ని కాగల్ను
నేనొక ప్రేమపూరిత హృదయాన్నవగల్ను



## నవ మల్లిక

వింజమూరి రాగసుధ, లండన్

వెన్నెల వానలో తడిసి మెరిసే

అరవిరిసిన నవమల్లిక
సింగారించుకున్న సువాసనలను
అందుకొన్నదో గాలివీచిక
నడిరేయి నిశబ్దానికి ఊరట చెందని ఓ అభిసారిక
కోరుకున్నది ఒక్కసారి తన ఇష్టసఖుని కలయిక
భావాల స్వరాలలో ఆలపించినదో మౌనగీతిక

## రసరేఖలు

- బచ్చోటి శ్రీధర్



రాగరంజితమౌనధరమ్మునందు
రాగసంయుత సంగీతర మలె సంగ
శ్రావ్య మృదురాగ గీతికల్ సాగి వచ్చి
శ్రవణపేయమౌనన్న యాశల వసింతు

ఆలపించెడు పాటలో నమరపదము
తేనెలొలికెడి మాటలో తీయదనము
కనుల సైగల బాసలో కమ్మదనము
తలచి యానందజలధి మున్కలను వైతు

నీ మనస్సు నీ చేతయు నీదు మాట
నీదు రూపము నీ తీరు నీదు నడక
నీదు హావభావమ్ములు నీదు చూపు
సాటి లేనివని తలంతు స్వప్నమందు

నా మధుర యోచనలకొక నవ్వు నవ్వి
కలల మెట్లను దిగి నిన్ను కాంచమంచు
నింగినుండి మరల్చితి నేలవైపు
ఇన్ని యూహలు యూహలే యన్న నీవు

స్వర్గమున దక్క దొరకదే సంతసమ్ము?
అప్సరల యాస్తి కాదు ప్రేమామృతమ్ము
మెరయ పనియేమి తారలై మింటియందు?
పూలమై వికసింతుమీ పుడమియందు

## నానీలు

గోపరాజు రాధాకృష్ణ
హైదరాబాద్

నీ గుండె
వాటర్ ప్రూఫా
తడే లేదు

ఆకులు రాలాయి
కొమ్మల్లో ఒంటరైంది
పక్షిగూడు

ప్రతి శిలా
ఓ అహల్య
ఉలి స్పర్శతో

చెట్టు కొట్టిన వాణ్ణి
వెక్కిరించింది
కొత్త చిగురు

చినుకులు
పుట్టింటికి
వాన

ఆలోచనలకు
సెల్యులార్ జైళ్ళు
అక్షరాలు

***




## దారి చూపిన దేవత

వేమూరి కృష్ణ, న్యూజెర్సీ

కలిసి గమ్యాన్ని
నిర్దేశించుకుంటాము ..
దారి తప్పో
దారి నుంచి తప్పుకునో,
పెడదారి పడుతుంటే
మాదారికి వచ్చి
ఓపిగ్గా
మార్గదర్శనం చేస్తావు
ఓదారి చూపిన దేవతా!
ఓ జి.పి.యస్ ..!
నువ్వు నిజ్జంగా
నా భార్యలాంటిదానివి...

# వజ్రకిరీటం వర్షం

పెరుగు రామకృష్ణ, నెల్లూరు



వణికిపోతున్న నా ఆనందాల్ని
వడిసి పట్టుకోవడానికి
తడిసి తడవని ఈ దేహంలో ప్రవహిస్తున్న రక్తాన్ని
పునర్జీవం పొందించడానికి
ఇప్పుడు నాకొక నవీన వర్షం కావాలి
నేను చిలిపితనాల నావ మీద ఎక్కడానికో
నా పసితనాన్ని పదికాలాలపాటు భద్రపరచుకోవడానికో
దేనికోసమైతేనేం...?
నాకొక వర్షం కావాలి.
నాలో పూరించలేని అగాధాలు పెరిగిపోతున్నప్పుడు
నా జ్ఞాపకాల క్రింద చిరునామా అయింది వర్షం
బహిష్కరించలేని బలహీనతల మధ్య
వర్షం ఒగొప్ప ఓదార్పు -
వర్షం ఎప్పుడూ వర్షమే
వర్షాల్ని బండరాళ్ళలో బంధించలేము
దాన్ని గుండె చాళ్ళలో పదిల పరచు కోవాలి తప్ప
బతుకు కోయిల నిద్రపోతూ ఉంది
వర్షం కూత సరికొత్త సంగీతమై దానిని నిద్రలేపుతూంది
వర్షం ఒకానొక జీవతాత్విక రాగం పాడుతుంది
సమాధిలో నిద్రించాక కూడా అది నన్ను నిద్రలేపుతుంది.
నా అతిథి, నా ప్రేమిక, నా సమస్తనేస్తమూ వర్షమే.
వర్షంలో తడిసిన ప్రతిసారి నేను తలెత్తుకు నిలబడతాను
ఏ వేటగాడు ఒడుపుగా విసిరిన వలలో వర్షం ఎప్పుడూ బందీ కాలేదు
నేను రాసిన నాలుగు అక్షరాలకే నాముందు వినమ్రంగా బందీ అయింది
ఆనందంగా నిలువునా తడిపేస్తూ నన్ను ఆశీర్వదించింది..
నాలోని ఒక్కో పార్శ్వాన్ని పూలచినుకులతో అభిషేకిస్తూ
నన్ను నవ్యమానవుడిగా ఆవిష్కరించింది.

## వసంత నేస్తం

వింజమూరి రాగసుధ, లండన్


ఎక్కడానువ్వు?

ఏ నిశీధి అంచుల్లో నిదురించావు?
ఏ కటిక చీకట్లలో దోబూచులాడుతున్నావు?
నా కనురెప్పల క్రీనీడలో నిన్ను ఆస్వాదించాలనీ
నీ ఒడిలో పసిపాపలా నేనాడుకోవాలనీ తాపత్రయపడ్డానే?
నువ్వు లేని వేసవిని భరించలేని కనుపాపలు
అశ్రువుల కొలనులో మునకలు వేస్తున్నాయి
దరి చేర్చి ఓదార్చే ఆలంబనలేని హృదయం
అలసిపోయి ఆర్ద్రత కోసం అలమటిస్తోంది
కదిలిరా వసంత నేస్తం
కర్కశమైన కాలం ఇచ్చిన క్లిష్టమైన గ్రీష్మ భావోద్వేగాన్ని
కలిసే ఎదుర్కొందాం

## మరణశయ్య

పెండ్యాల వెంకటేశ్వరరావు
కువైట్

మరో బాల్యానికి ఆదిగా
పునర్జన్మకు పునాదిగా
అంతరింపచేసి తరింపచేసే పానుపు
మానవ జన్మ మోక్ష ప్రయాణపు ఆఖరి మజిలీ
కొడుకుల కోపం, కోడలి విసుర్లకు
చలించని స్థిత ప్రజ్ఞత్వం అలవడే నెలవు
దొంగ నా కొడుకులు చేసిన మోసాలు,



దొంగతనంగా జాంకాయలు కోసిన వేషాలు,
జ్ఞాపకాలు, మనఃఫలకం నుండి మసకబారే ప్రదేశం...
లేటుగానైనా నీ వాళ్ళెవరో తెలిపి జ్ఞానోదయమిచ్చే పుణ్యస్థలి.
నీకున్న గౌరవం విలువల బరువును నిఖార్సుగా తెలిపే వేయింగ్ బెడ్
భవిష్యత్ బాల్యావస్థకై ముడుచుకు పడుకోవడం నేర్పే సాధనా స్థలం,
మరణ శయ్యపైకొచ్చావంటే మంచి రోజులొచ్చినట్లే...
పాజిటివ్ దృక్పథం పాదుకొల్పుకో తమ్ముడూ!
ఆఖరి కష్టంలో కూడా ఆనందం వెతుక్కో అమ్మడూ!

## గువ్వ ఎగిరిపోయినా... గూడు నిదుర పోవునా!?...

- తమస్విని, హైదరాబాద్

సద్దినిల్లు సద్దినట్లే ఉంది
సోఫాల్లో సగం మడచిన పుస్తకాలు లేవు
నేల మీద దొర్లుతూ కాళ్ళకిందపడే పెన్నులు లేవు
నిశ్చల చిత్రంలా ఇల్లు కదలిక లేకుండా ఉంది
ఎవరూ లేని గదిలో తిరిగే ఫాను,
ఎవరూ చూడకపోయినా ఆన్‌లో ఉండే టీవీ
కొప్పెగిరి పోయేలా పాడే సిడీ ప్లేయర్
విశ్రాంతి తీసుకుంటున్నాయి
విరామం లేకుండా మోగే ఫోను
పదవీ విరమణ చేసినట్లుంది
మూతలేని సబ్బు పెట్టె స్విచ్చాపని ఇస్త్రీపెట్టె
మంచాల మీద తడి టవళ్ళు
హేంగర్లకి వేలాడే బట్టల దొంతర్లు...
అప్పట్లో విసుగు కలిగించే చేష్టలు
ఆలోచిస్తుంటే మురిపెంగా ఉన్నాయి
అమ్మా కాఫీ, అమ్మా ఆకలి

అరుపులతో దద్దరిల్లిన ఇల్లు చిన్నబోయింది
చదువులైపోయి పొట్ట చేత పట్టుకుని
జీవనయానంలో పిల్లలు దేశాలు పట్టుకునిపోతే
పిచ్చి సన్నాసులు ఎలా ఉన్నారో ఏమో?
మనసులో ఓ మూల చిన్న కదలిక
అమ్మతో మాట్లాడి ఎన్ని రోజులైందో
నా ఫోన్ కోసమే పల్లెలో అమ్మ
శబరిలాగా వేచి ఉంటుంది!

## రసరేఖలు

- బచ్చోటి శ్రీధర్

ఇరులు నిండినయట్టి నా హృదయమందు
నిన్ను చూసిన నాడె వెన్నెలలు విరిసె
మూగగొంతుననెలుగెత్తె రాగతతులు
కన్నులందున వెలిగెను కాంతి ఝురులు

ఆకసము వంగి నా దగ్గరైన యట్లు
అమరలోకమే నాకెదురైన యట్లు
అప్సరలు వచ్చి ముచ్చటలాడినట్లు
గుండె యెల్లను భ్రాంతితో నిండిపోయె

ఎల్లలెరుగని ప్రేమ నా యెదను నిండ
పగ్గమెరుగని ముదముతో పరుగు తీసి
జీవితమ్మెల్ల తెచ్చి యిచ్చితిని నీకు
చేరనొల్లక త్రోసిపుచ్చితివి నన్ను

చెంత చేరిన తోడు నచ్చినను కాని
ఇంటి వారలితనినొల్లరేమొ యనుచు
వెదకి వచ్చిన తీగను వీడినావు
వీడిపోయితి నిను వేరె జాడ లేక

తగిన తోడును తేలేక తపన చెందు
కన్నవారల యిడుములు కాంచినపుడు
సాగు సెలయేటనిడిన పుష్పమును చూచి
కార్చు కన్నీరె నాకు నీ కానుకయ్యె



## వందనం

- రవి కిరణం



అమ్మ ఒడిలో పలుకు నేర్పి
నాన్న నీడన అడుగులేసి
పయనమయ్యిన జీవనం

దారిపొడుగున అడుగు అడుగున
అంధకారము చుట్టువేళనా
వెలుగు చూపిన గురుజపం

"అక్షరాలనే" లక్షలిచ్చి
"లక్షణాలనే" మణులనిచ్చి
నా నొసటి గీతని
తిరిగి రాసిన "గురుబ్రహ్మ"...... వందనం

"ఆశయాలనే" ఆర్తినేర్పి
అందలాలను చేరుకొనగా
నా బ్రతుకు రీతిని
మార్చ వచ్చిన "గురుదేవా" పాదాభివందనం




## మొదటి పలుకు

భరద్వాజ్ దుగ్గరాజు, హైదరాబాదు

ఆ కుసుమ కోమల అధరాలపై నేడు చిరునవ్వు విరిసెను
ఆ మధురగానము విని కోయిలే అబ్బుర పోయెను
మొదటిసారి మాటల జల్లు కురిసెను
విన్నవారి హృదయాన హరివిల్లు విరిసెను
ఏమి మాధుర్యం ఆ పలుకులో
ఏమి వయ్యారం ఆ పసి కులుకులో
అమ్మ, అని ముద్దుగా పలికింది ఆ బుజ్జి అధరము
ఆశ్చర్య పోయాయి గగనము భూతలము
మొదటి పలుకులోని తియ్యదనము
మొదటి అనే భావనలోనే కమ్మదనము
కలకాలం నిలుస్తుంది ఆ మధుర జ్ఞాపకము
ప్రతి పలుకుతో కావాలి అది ఉన్నతమైన జీవితము
ప్రతి శిశువుకి ఇదే నా మనస్ఫూర్తి ఆశీర్వాదము

## ధనమా!

పవన్ కుమార్ మొంగవరం , కామారెడ్డి




ధనమా! మానవజాతినంతటిని సంధానించి భాగించు యిం
ధనమా! విశ్వజననీ సంస్కృతిని నానారీతులం గూల్చు సా
ధనమా! తల్లియు దండ్రియున్ సుతుల భేదమ్మెంతయున్ లేక, వే
దనపాల్జేయు దురంత కర్కశ హవిర్ధారీ! నమోవాకముల్.

## నెచ్చెలీ!

కోడూరు శ్రీ వేంకటేశ్వర స్వామి
హైదరాబాదు



నెచ్చెలీ! నీ చింత నా చింత
గుండె గుప్పెట్లోన దాచి ఉంచాను
మనసు మందిరమ్ము చేసి చూచాను
హృదయంపు ద్వారమ్ము తెరిచి వేచాను
నెచ్చెలీ! నీ రాకయే నా చింత తెలిసి రావేల?

వయసు ఉత్పలమాల కాగ దాచాను
మనసు మల్లెమాలగ మార్చివేశాను
నీ ఊహ చంపకమాల చెంత పలుకరావదేల?

కరుణ నీ మతమని కనులతో పలికావు
కన్గల్వతో నైన కనికరించగ రావు
మనసు చంగల్వని మంచులో తడపవే
నెచ్చెలీ! నీ చింత నా చెంత తెలుప రావేల!

## కలుపు

- భాషా, దక్షిణ కొరియా

ఆవేశముందు నీకు, ఆలోచన ఉంది.
రెండిటినీ కలిపి చూడు అందులోనే జయముంది.

వివేకం ఉంది నీకు, విచక్షణా ఉంది.
రెండిటినీ కలిపి వాడు విజయ తీరమందుతుంది.



కష్టపడే గుణముందు, ఇష్టపడే మనసుంది.
రెండిటినీ కలుపుకెళ్ళు గెలుపు నీ వెనకుంది

నీతిజాతి నీకుంది, నిజాయితీ తోడుంది.
రెండిటినీ కలిపి చూపు అందులోనే ధర్మముంది

అభిమానం ఉంది నీకు, ఆరాధన ఉంది.
అదీ ఇదీ కలిపి చెప్పు అందులోనే ప్రేముంది

ఆప్యాయత ఉంది నీకు, ఆవేదన ఉంది.
కొంత కొంత కలిపి చూపు అందులోనే సేవ ఉంది

ఎన్నున్నా, ఎంతన్నా వాడకుంటే ఏం లాభం.
ఇంతైనా, కొంతైనా వాడితేనే దక్కు ఫలం.

## రసరేఖలు - బచ్చోటి శ్రీధర్

ముదము పెల్లుబుకునెదను మోసికొనుచు
ఒంటరిగ నేను పోవుచునుంటినెటకొ
గిపోయితినెవ్వరో సైగ చేయ
బాట ప్రక్కన విరియొండు పలుకరించె

ఓయి గాయకుడా! యుల్లమూగిపోవ
ఏల వల్లింతు ప్రేమగీతాల నీవు?

ప్రేమ వెదజల్ల నింతటి విశ్వముండ
ఒక్క ప్రేయసి వలలోన చిక్కితేల?

పూపపిందెలు గలవు పూపొదలు గలవు
పొసగు తేనియలు గలవు పూలు గలవు
కేకి నాట్యాలు గలవు కోకిలలు గలవు
హంస నడకలు గలవెన్నొ యళులు గలవు

కలతలు గలవు కడగండ్ల కథలు గలవు
బడుగు బ్రతుకులు గలవెన్నొ వ్యథలు గలవు
రోదనలు గలవాకలి రొదలు గలవు
వీధి నివసించు బాలల వెతలు గలవు

పిడికెడంతయు లేని నీ యెడదనుండి
ప్రేమ వెదజల్ల జగమెల్ల వెలితి యగునె?
అంచు నిలదీసి యడిగెనా యలరుకన్నె
మారు పల్కజాలని యసమర్థుడైతి

## పచ్చచీర - తమస్విని, హైదరాబాదు

నా లేత పసుపు సిల్క్ చీరని చూస్తే
'చేమంతి పూవులా ఉన్నావు..ఈ రంగు నీ
వంటి రంగులో కలిసి అసలు చీర కట్టుకున్నావా
లేదా అని అనుమానం వస్తుంది' అన్న నీ గుస గుస
ఇంకా చెవిలో మారు మోగుతున్నట్లుంది
సిగ్గుల మొగ్గయిన నా నవ వధువు ముగ్ధత్వం గుర్తుకొస్తుంది!
నా లేత పసుపు సిల్క్ చీరని చూస్తే

‘ నా కోసం ఎదురు చూడకు భోంచేసేయ్..
మెలకువగా ఉండక్కర్లేదు ‘ అన్న నీ పొడిమాటలు
చెంపమీద కొట్టినట్లుగా వినిపిస్తుంటాయి
బిత్తరపోయిన నా కలల సౌధం పేక మేడలా
కూలుతున్న చప్పుడు గుండెల్లోంచి వినిపిస్తూంటుంది!!

నా లేత పసుపు సిల్క్ చీరని చూస్తే
‘వెలిసిపోయిన మొహంతో ఎందుకలా నాచుట్టూ
తిరుగుతావు ..నా కళ్ళ ముందు కనబడకు.. చిరాకేస్తుంది. ‘ నీ
మాటల తూటాలు మనసుని తొలుచుకు పోతున్నట్లుంటుంది
రంగు మాసిన పచ్చచీర నన్ను చూసి నవ్వుతున్నట్లనిపిస్తుంది..!!!

## వర్ణనాతీతము

అపర్ణ (మునుకుట్ల)గునుపూడి

ఏడు వర్ణముల చిత్రమే
ఇంద్రధనువాయెగా
అన్ని రంగుల కలిపి
తన కడుపులో నింపి
అపురూపమౌ తెలుపు
అహో! ఏమా ఉదారబుద్ధి
వర్ణనాతీతము

రంగు రూపుల మించి
రాజయోగ్యునికి జనులు
రాజ్యాంగమిచ్చిరి
మునుమ్ముందడుగు వైచి
రుజువు చేసిరి ప్రగతి
అహో! ఏమియాదర్శము

వర్ణనాతీతము

పొదలమాటున పొంచి
బురాచకాలాచరించు
పోకిరి సి ఇ ఓల ఆట
కట్టించ వచ్చె బరాకు
మరి ముందున్నదిగా బంగారు బాట
అహో! ఏమియానందము
వర్ణనాతీతము